RNI NO .TGTEL/25/A4366

## పారామెడికల్ కొలువుల భర్తీకి గ్రీన్ సిగ్నల్




ప్రజా భవన్ ఆందోళనతో కదిలిన యంత్రాంగం


# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక



**విలేకరులు కావలెను**

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387


PUBLISHED: TELANGANA సంపుటి : 01 సంచిక :15 శనివారం 20 డిసెంబర్ 2025 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 08 వెల :05/-


### ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ అప్‌డేట్.. ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ పొడిగింపు




### ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో మోసం.. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరెస్టు




### అమెరికాలో ఘోర ప్రమాదం.. బిజినెస్ జెట్ కూలి పలువురు మృతి




### అప్పులపైనే ఆధారం.. నవంబర్ నాటికే 107% అప్పులు




### కర్ణాటక ఆర్టీసీ దివాలా!.. 4 వేల కోట్ల బకాయిలు




### మరోసారి భారత్‌లో ఉగ్రదాడులకు కుట్రలు

యాక్టివ్‌గా మహిళా విభాగం




### త్వరలోనే నాకు మంత్రి పదవి వస్తుంది

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి




## తలసీమియా చికిత్సకోసం వెళ్తే హెచ్ఐవీ సోకింది

### రక్త మార్పిడితో ప్రమాదంలో చిన్నారుల జీవితాలు

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తలసీమియా తో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులు చికిత్స కోసం వెళ్లగా.. వైద్యుల నిర్లక్ష్యం ఆ పిల్లలకు జీవితాన్నే లేకుండా చేసింది. చికిత్సలో భాగంగా వైద్యులు ఆ చిన్నారులకు హెచ్ఐవీ సోకిన రక్తం ఎక్కించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది.

సత్నా కు చెందిన కొందరు చిన్నారులు తలసీమియా వ్యాధితో బాధపడుతున్నారు. తల్లిదండ్రులు వారిని సత్నాలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పిల్లల్ని పరీక్షించిన వైద్యులు వారికి రక్తమార్పిడి చేశారు. 150 మందికి పైగా దాతల నుండి సేకరించిన రక్తాన్ని మూడు వేర్వేరు బ్లడ్ బ్యాంక్స్ నుంచి తీసుకొచ్చి చిన్నారులకు ఎక్కించారు. ఈ రక్తమార్పిడితో చిన్నారులకు ప్రాణాంతక హెచ్ఐవీ బారిన పడ్డారు.




రక్తం ఎక్కించిన కొన్ని రోజులకే చిన్నారులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వారికి రక్త పరీక్షలు చేయగా హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారణఅయింది. రిపోర్ట్స్ చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికీ ఈ వ్యాధి లేకపోయినా.. పిల్లలకు సంక్రమించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, వ్యాధి సోకిన సూది వాడటంగానీ లేదంటే కలుషిత రక్తాన్ని ఎక్కించడం ద్వారాగానీ ఈ వ్యాధి సంక్రమించి ఉండవచ్చని సత్నా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ దేవేంద్ర పటేల్ తెలిపారు. తలసీమియాతో బాధ పడుతున్న ఈ ఐదుగురు పిల్లలకు అనేకసార్లు రక్తమార్పిడి చికిత్స జరిగినట్లు గుర్తించారు.

## తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి 150 విమానాలు రద్దు




దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచిక 380కి పడిపోయింది. తీవ్ర కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

దృశ్యమానత పడిపోవడంతో శుక్రవారం ఉదయం ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 152 విమానాలు రద్దయ్యాయి. వాటిలో 79 డిపార్చర్స్ కాగా, 73 అరైవల్స్ ఉన్నాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపింది.

# మంత్రులపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు గరం..!

## శాఖలు మార్చాలని హైకమాండ్‌కు ఫిర్యాదు



- సొంత పార్టీ నుంచే మంత్రులపై అసంతృప్తి వెల్లువ
- శాఖలు మార్చాలని హైకమాండ్‌కు ఎమ్మెల్యేల ఫిర్యాదులు
- మంత్రుల ఇళ్ల వద్ద అవమానకర వ్యవహారం - ఎమ్మెల్యే ఆవేదన
- నియోజకవర్గ పనులకే వెళ్లినా నిర్లక్ష్యమేనని ఆరోపణలు
- యువ ఎమ్మెల్యేల లిఖిత పూర్వక కంప్లయింట్లు
- సీనియర్లకూ టైం కరువు - గర్వమే కారణమా?
- మంత్రివర్గ ప్రక్షాళన ప్రచారానికి బలం పెరుగుతుందా?

మిగతా 2 లో

మంత్రులపై విపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు కోపంగా ఉండటం సహజం. కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, లీడర్లే కొందరు మంత్రులపై గుర్రుగా ఉండటం హాట్ టాపిక్‌గా మారింది. సదరు మంత్రుల దగ్గర నుంచి ఆ శాఖలను తప్పించాలంటూ కొందరు ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది. త్వరలో మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళన జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో సంబంధిత మంత్రులపై వారు కంప్లయింట్ చేసినట్లు తెలిసింది.

## మావోయిస్టులకు షెల్టర్.. పోలీసుల అదుపులో అర్బన్ కో-ఆర్డినేటర్ ప్రభంజన్




రాష్ట్రంలో మావోయిస్టుల అరెస్టులు, అగ్ర నేతల లొంగుబాట్ల పర్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పోలీసులు ఓ మావోయిస్టు అర్బన్ కో-ఆర్డినేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మావోయిస్టులకు గుట్టుచప్పుడు కాకుండా షెల్టర్ ఇస్తున్న జన్నారం గ్రామానికి చెందిన పీడీఎస్‌యూ నేత ప్రభంజన్ ను గుర్తించి అరెస్ట్ చేశారు

## సీనియర్ నేతలే నన్ను మోసం చేశారు

### ఎమ్మెల్యే మేఘారెడ్డి హాట్ కామెంట్స్




వనపర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు తారాస్థాయికి చేరింది. పంచాయతీ ఎన్నికల వేళ పార్టీలోని సీనియర్లు తనకు అన్యాయం చేశారంటూ ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. అధిష్ఠానం అడిగితే తాను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమని తెలిపారు. శుక్రవారం ఉదయంలో ఆయన మాట్లాడుతూ..

## 'అలాంటి ఒప్పందమేదీ జరగలేదు'

### సీఎం పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య..!




కర్ణాటక లో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు.

'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి.

## ప్రభుత్వ అంశాల్లో టీపీసీసీ చీఫ్ జోక్యం..

### సరికాదంటున్న సీనియర్లు




ఈ మధ్య పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన మాట్లాడిన అంశాలు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వ వర్గాల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. భవిష్యత్ లో సైతం ఆయన ఇదే విధంగా వ్యవహరిస్తే వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని లీడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిసెంట్ గా డిల్లీ పర్యటనలో మహేశ్ కుమార్ మీడియాతో పిచ్చాపాటిగా పార్టీ, ప్రభుత్వంలోని అంతర్గత అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పార్టీలోని అంశాలపై అధ్యక్షుడి హోదాలో ఏమైన మాట్లాడవచ్చు. కాని ప్రభుత్వ అంశాలపై ఆయన తన అభిప్రాయాలను బయటికి చెప్పడం సరికాదని సీనియర్ లీడర్లు సూచిస్తున్నారు.

కేబినెట్ ప్రక్షాళన సీఎం పరిధిలోని అంశం

మంత్రివర్గం ప్రక్షాళన చేయడమా? ఒకవేళ చేస్తే ఎవరిని తీసుకోవాలి?ఎవరిని తప్పించాలి?ఏ మంత్రులు శాఖలు మార్చాలి?అనే అంశాలు పూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి పరిధిలోనివి. ఈ విషయాలపై ఆయన అధిష్టానాన్ని సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆయనకు ప్రభుత్వంలో జరిగే పరిణామాలు తెలుస్తుంటాయి.

## అప్పులపైనే ఆధారం.. నవంబర్ నాటికే 107% అప్పులు

రాష్ట్ర బడ్జెట్‌లో రాబడుల అంచనా: రూ.2,29,720.63 కోట్లు

నవంబర్ నాటికి వచ్చింది: రూ.1,08,685.45 కోట్లు (47.31%)

బడ్జెట్‌లో వార్షిక రుణ అంచనా: రూ.54,009.74 కోట్లు

నవంబర్‌నాటికి చేసిన అప్పు: రూ.58,068.90 కోట్లు (107.52%)

| | | |
|---|---|---|
| గత ఐదేండ్లలో నవంబర్ నాటికి రాష్ట్ర రుణ సమీకరణ ఇలా.. | 2021-22 | 66.35% |
| | 2022-23 | 49.70% |
| | 2023-24 | 99.78% |
| | 2024-25 | 76.84% |
| | 2025-26 | 107.52% |
| గత ఐదేండ్లలో నవంబర్ నాటికి రాష్ట్రానికి సొంత రాబడులు | 2021-22 | 42.55% |
| | 2022-23 | 50.05% |
| | 2023-24 | 51.32% |
| | 2024-25 | 46.69% |
| | 2025-26 | 47.31% |

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గడిచిన నాలుగేండ్లలో ఎన్నడూ లేనంతగా రాష్ట్ర సొంత రాబడి క్షీణించింది. వార్షిక బడ్జెట్ అంచనా లక్ష్యంలో ఎనిమిది నెలలు దాటినా సగానికి కూడా చేరలేదు. ప్రతి ఏడాది బడ్జెట్ అంచనాలు పెరుగుతున్నా, వాస్తవ రూపంలో ఖజానాకు వచ్చే ఆదాయం తగ్గుతున్నది. అప్పుల భారం మాత్రం గుట్టలా పెరిగిపోతున్నది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తాజాగా విడుదల చేసిన నవంబర్ నెల రాష్ట్ర ఆదాయ, వ్యయాల నివేదికను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ వ్యయాలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉండటం, వాటిని పూడ్చడానికి అప్పులపై ఆధారపడటం ఈ నివేదికలో ప్రధానంగా కనిపిస్తున్నది. ఆర్థిక సంవత్సరంలో రూ.54,009.74 కోట్ల వరకు అప్పులు చేయవచ్చని బడ్జెట్‌లో అంచనా వేసుకున్నారు. కానీ నవంబర్ నాటికే రూ.58,068.90 కోట్ల అప్పు చేశారు. కేవలం (ఏప్రిల్–నవంబర్) తొలి 8నెలల్లోనే బడ్జెట్ అంచనా కంటే 107.52%అప్పులు చేయడం ప్రభుత్వ ఆర్థిక వైఫల్యానికి అద్దం పడుతున్నది.

అదుపు తప్పుతున్న అప్పులు

అదుపు లేకుండా అప్పులు చేస్తున్న రాష్ట్ర సర్కారు.. సొంత రాబడులను పెంచుకోవడంలో మాత్రం చతికిల పడుతున్నది. 2022–23లో నవంబర్ నాటికి బడ్జెట్ అంచనాలో 49.7% అప్పులు చేశారు. 2024–25కు ఇది76.84 శాతానికి చేరింది. 2025–26 (ప్రస్తుత ఏడాది) నవంబర్ ముగిసే సమయానికే ప్రభుత్వం 107.52% అప్పులు చేసింది. అంటే, ఏడాది మొత్తానికి అనుకున్న అప్పును ఎనిమిది నెలల్లోనే దాటేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రమాదకర స్థాయికి సంకేతంగా ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల గ్యారెంటీలు, పబ్లిక్ అకౌంట్ నుంచి తీసుకున్న అప్పుల వివరాలను ప్రభుత్వం కాగ్‌కు సమర్పించలేదు. ఇది రాష్ట్ర అసలు అప్పుల లెకలపై అనుమానాలను కలిగిస్తున్నది.

## మరోసారి భారత్‌లో ఉగ్రదాడులకు కుట్రలు యాక్టివ్‌గా మహిళా విభాగం

భారతదేశంలో పహల్గామ్ ఎటాక్, ఎర్రకోట బ్లాస్ట్ తరహా మరిన్ని దాడులు చేసేందుకు పాక్ ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహ్మద్ కుట్రలు చేస్తోంది. అయితే ఇందుకోసం పురుషులను కాకుండా మహిళా విభాగాన్ని యాక్టివేట్ చేస్తోంది. జమాత్ ఉల్ మొమినాత్ పేరుతో మహిళా ఉగ్రవాద విభాగం పనిచేస్తోంది. ఇక గురువారం పూంచ్ లైన్ ఆఫ్ కంట్రోల్ ఎల్‌ఓసీ వద్ద పాకిస్థాన్ మహిళ భారత్ లోకి చొరబడేందుకు ప్రయత్నించింది. ఆమెను గుర్తించి సైనికులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మహిళ షెహనాజ్ అక్తర్ గా గుర్తించగా పాక్ ఆక్రమిత కశ్మీర్ కు చెందిన మహిళ అని నిర్ధారించారు. విచారణలో ఆ మహిళకు జైష్ ఎ మహ్మద్ తో లింకులు ఉన్నట్టు తేలింది.


అంతేకాకుండా సరిహద్దులు దాటే ముందు ఆ మహిళ పాకిస్థాన్ సైనికులతో మంతనాలు సాగించినట్టు కూడా తెలుస్తోంది. బార్డర్ దాటిన తరవాత ఆమె కలవాల్సిన వ్యక్తి గుర్తించి సైతం చర్చించినట్టు సమాచారం. ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనలో మహిళా ఉగ్రవాదుల విషయం బయటపడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మహిళా డాక్టర్ తో పాటు పలువురు పట్టుబడ్డారు. ఇక మహిళా ఉగ్రవాదుల విభాగంలో ఉగ్రవాదుల భార్యలే ఉన్నట్టు తెలుస్తోంది. అంతే కాకుండా ఉగ్రవాది మసూద్ సోదరి మహిళా ఉగ్రవాదుల విభాగానికి నాయకత్వం వహిస్తున్నట్టు సమాచారం. ఇంటిలిజెన్స్ కు సమాచారం అందడంతో మహిళా ఉగ్రవాదులపై నజర్ పెంచినట్టు తెలుస్తోంది.

## త్వరలోనే నాకు మంత్రి పదవి వస్తుంది కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మంత్రి పదవిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అదృష్టం ఉంటే మంచి పదవి వస్తుందని అన్నారు. ఇన్ని రోజులు ఆగానని త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందని చెప్పారు. చాలా కాలంగా రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి గురించి మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో చేరే సమయంలోనే తనకు అధిష్టానం మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు.

కానీ ఇప్పుడు ఇవ్వడంలేదని అనేకసార్లు మీడియా సమావేశాల్లో అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కూడా పలుమార్లు మీడియా ముఖంగానే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నానని మంత్రి పదవి ఉంటే మరింత అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. ఇక ఇప్పుడు మంత్రి పదవిపై పాజిటివ్ గా మాట్లాడటంతో కోమటిరెడ్డికి పదవిపై ఏమైనా సంకేతాలు అందాయా అనే చర్చ జరుగుతోంది.

## పంచాయతీ ఎన్నికల్లో చిత్రం.. సర్పంచ్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు సున్నా




రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గెలుపు కోసం సర్పంచ్ అభ్యర్థులు ఎక్కని గడప లేదు అన్నట్లుగా ప్రచారం నిర్వహించారు. కొన్ని కొట్ల మద్యం ఏరులై పారగా.. మరికొన్నిచోట్ల డబ్బు ప్రభావం పని చేసింది. ఈ క్రమంలోనే మూడు విడత పంచాయతీ ఎన్నికల్లో ఓ చిత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండల పరిధిలోని కీర్యాతండా లో పంచాయతీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. గ్రామంలో మొత్తం 239 ఓట్లు పోల్ అవ్వగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి బోడ గౌతమి కి కనీసం ఒక్క ఓటు కూడా పడలేదు. అదేవిధంగా మరో ఇద్దరు అభ్యర్థులు బాదావతు లలితకు 79 ఓట్లు, బోడ విజయకు 156 ఓట్లు వచ్చాయి. నోటాకు ఒక ఓటు పడింది. 3 ఓట్లు చెల్లుబాటు కాలేదని ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే, సర్పంచ్ అభ్యర్థి బోడ గౌతమికి ఒక్క ఓటుకు పడకపోవడం పట్ల ఆమె ఓటును ఆమె వేసుకోలేదా అని అటు గ్రామస్థులు.. చిత్రం చూసిన ప్రజలు నోళ్లు వెళ్లబెడుతున్నారు.

## 18.38 లక్షల ఉపాధి హామీ పథకం కార్డులు రద్దు




ఓవైపు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుండగానే.. కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు 18.38 లక్షల MGNREGA కార్డులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే సాధారణంగా 3 నెలలకు ఒకసారి ఉపాధి హామీ కార్మికులను సమీక్షించి వలసదారులను, పనులకు రానివారిని, మృతులను జాబితా నుంచి తొలగించి వారి కార్డులు రద్దు చేస్తారు. కానీ ఈ ఒక్క త్రైమాసికంలోని అక్టోబర్ 10 నుంచి నవంబర్ 14 మధ్య కేవలం 5 వారాల్లోనే 11.07 లక్షల కార్డులను తొలగించడం చర్చకు దారి తీసింది. కాగా 2025–26 కు చెందిన తొలగించిన కార్డుదారుల్లో అత్యధికంగా ఏపీకి చెందిన వారే లక్షకు పైగా ఉండటం గమనార్హం. అయితే వృద్ధులు, ఈ పని ఇష్టం లేనివారు స్వచ్ఛందంగానే వారి పేర్లు తొలగించుకున్నారని అధికారులు చెబుతున్నారు.

## మావోయిస్టులకు షెల్టర్.. పోలీసుల అదుపులో అర్బన్ కో-ఆర్డినేటర్ ప్రభంజన్

మొదటి పేజీ తరువాయి

అయితే గత కొన్నాళ్లుగా ప్రభంజన్ మావోయిస్టులకు షెల్టర్ పేరిట పెద్ద ఎత్తున డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ మేరకు అతడిని జన్నారం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

కాగా, తెలంగాణ పోలీసులు చేపట్టిన మేజర్ ఆపరేషన్‌లో ఏవోబీ కమాండర్ ఎర్రోళ్ల రవి తో పాటు 35 మంది మావోయిస్టులు సరెండర్ అయినట్లుగా తెలుస్తోంది. అందులో హిడ్మా బెటాలియన్ కమాండర్లు కూడా ఉన్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇవాళ డీజీపీ కార్యాలయం నుంచి కీలక ప్రకటన వెలువడింది. మధ్యాహ్నం 2.30 గంటలకు డీజీపీ కార్యాలయంలోని టెన్నిస్ కోర్టు గ్రౌండ్‌లో డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశాన్ని నిర్వహిస్తున్నారని, వార్తాపత్రికల రిపోర్టర్లు, ఫొటో, వీడియో జర్నలిస్టులు హాజరు కావాలని డీజీపీ సీపీఆర్వో శ్రీనివాస రావు మీడియాకు సమాచారమిచ్చారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ అప్‌డేట్.. ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ పొడిగింపు

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు పై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ధర్మాసనం ఆదేశాల మేరకు డిసెంబర్ 12న కేసులో ప్రధాన నిందితుడు మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనానికి సిట్ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావుకు సంబంధించి వారం రోజుల కస్టోడియల్ రిపోర్టును అందజేశారు. అయితే, ఆ రిపోర్టులో చివరగా నిందితుడు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని, మరోసారి కస్టోడియల్ విచారణ అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం ఈనెల 25 వరకు ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణను పొడిగిస్తున్నట్లుగా ప్రకటించింది.

## ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో మోసం.. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరెస్టు

రియల్ ఎస్టేట్ రంగంలో 'ప్రీ లాంచ్ ఆఫర్' పేరుతో వేలాది మంది కొనుగోలుదారులను మోసం చేసిన జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. తాజాగా ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కాకర్ల శ్రీనివాస్ ను చెన్నైలో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

కాగా, బాధితుల ఫిర్యాదుల మేరకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే కాకర్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేసినప్పటికీ, బెయిల్‌పై విడుదలైన అనంతరం అతను పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ, ఇటీవల చెన్నైలో అతడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నట్లుగా తెలుస్తున్నది. కంపెనీ ప్రీ–లాంచ్ ఆఫర్లు, భవిష్యత్ ప్రాజెక్టుల పేరుతో జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వందలాది మంది నుంచి సుమారు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి మోసం చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఇళ్లు, ఫ్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చి, నిధులు సేకరించినా ప్రాజెక్టులు పూర్తి కాకుండా, రిఫండ్లు కూడా ఇవ్వకుండా మోసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈడీ ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, ముఖ్యమైన డాక్యుమెంట్లు, డిజిటల్ డివైస్‌లు స్వాధీనం చేసుకుంది. బాధితుల నుంచి సేకరించిన నిధులను షెల్ కంపెనీల ద్వారా మళ్లించినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

## సీనియర్ నేతలే నన్ను మోసం చేశారు ఎమ్మెల్యే మేఘారెడ్డి హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

పార్టీ జెండా మోసిన అనుకునే వాళ్లు నిలువునా మోసం చేశారని అన్నారు. ముందు నుంచి ఒకరు, వెనుక నుంచి మరొకరు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

నా వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి..

వనపర్తి నియోజకవర్గ పరిధిలో 140 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. అందులో తాము 85 పంచాయతీల్లో విజయం సాధించామని తెలిపారు. మరో 10 నుంచి 15 స్థానాల్లో తమ పార్టీకి చెందిన సీనియర్ నాయకులే మోసం చేశారని ఆరోపించారు. ఒకవేళ ఎలాంటి అవాంతరాలు లేకపోతే 100 పైగా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచేదని అన్నారు. ఏ గ్రామంలో ఎవరెవరు సమస్యలు సృష్టించారనేది ప్రజలకు, పార్టీ పెద్దలకు లెక్కలతో సహా చెబుతానని తెలిపారు. తన సారథ్యంలో అత్యధిక పంచాయతీలు గెలవకుండా కొందరు సీనియర్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రోత్సహించి కుట్రలు చేశారని, అధిష్టానం అడిగితే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమని అన్నారు. జంగమయ్యపల్లి, ఉప్పరపల్లి, అప్పారెడ్డిపల్లి, గోపాల్‌పేట, పొలికపాడులో ఇలా చాలా గ్రామాల్లో జరిగిన పరిణామాలకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని.. అవాస్తవం కాదని స్పష్టం చేశారు. మేఘారెడ్డిపై కోపం ఉంటే.. మేఘారెడ్డిని, మల్లు రవి పై కోపం ఉంటే మల్లు రవిని పొడవాలని, అంతే కానీ పార్టీకి అన్యాయం చేయడం సరికాదని మేఘారెడ్డి అన్నారు.

## మంత్రులపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు గరం..! శాఖలు మార్చాలని హైకమాండ్‌కు ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

ఇంటికి వెళ్తే గంటల కొద్ది కూర్చోబెడుతున్నారు

తమ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ఆ ముగ్గురు మంత్రుల వద్దకు వెళ్తే రిసీవ్ చేసుకునే విధానం సరిగా ఉండటం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వెళ్తే వెంటనే కలవకుండా గంటల కొద్ది కూర్చోబెడుతున్నారని, చివరకు కలిసినా పొడిపొడిగా మాట్లాడుతున్నారని, అందులోనూ అవహేళన మాటలు ఎక్కువగా ఉంటున్నాయని, ఇలా ఇప్పటికే ఐదారుసార్లు జరిగిందని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. తాము పైరవీల కోసమో, సొంత పనుల కోసమో మంత్రుల వద్దకు వెళ్లడం లేదని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం వెళ్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి అనుభవం తన ఒక్కరికే కాదని, కొత్తగా ఎన్నికైన మెజార్టీ ఎమ్మెల్యేల్లో ఉందని ఆయన వివరించారు.

అధిష్టానానికి ఫిర్యాదు

సదరు మంత్రుల పనితీరుపై విసిగి పోయిన కొందరు యువ ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో పాటు కాంగ్రెస్ అధిష్టానానికి సైతం లిఖిత పూర్వకంగా కంప్లైట్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ విషయాన్ని దక్షిణ తెలంగాణకు చెందిన ఓ యువ ఎమ్మెల్యే వివరించారు. 'మేం కూడా వాళ్లతో సమానంగా ఎమ్మెల్యేలమే. ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచాం. మాకే టైం ఇవ్వకపోతే, సాధారణ ప్రజలను ఎలా కలుస్తారు?' అని ప్రశ్నించారు.

సీనియర్ లీడర్లకు సైతం అదే అనుభవం

పార్టీకి చెందిన సీనియర్ లీడర్లకు సైతం సదరు మంత్రులు టైం ఇవ్వడం లేదనే ఫిర్యాదులున్నాయి. 'ఆ మంత్రులకు చాలా గర్వం. ఫోన్ లిఫ్ట్ చెయ్యరు. వెళ్తే కలవరు. ఇట్లా ఉంటే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తది. వాళ్లను ఆయా శాఖల నుంచి తప్పించాలి. కొత్త వాళ్లకు కేటాయించాలి' అని దక్షిణ తెలంగాణకు చెందిన ఓ సీనియర్ లీడర్ తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. ఈ విషయాలపై పార్టీ పెద్దలకు లేఖ రాసినట్టు ఆయన వెల్లడించారు.

## ప్రభుత్వ అంశాల్లో టీపీసీసీ చీఫ్ జోక్యం.. సరికాదంటున్న సీనియర్లు

మొదటి పేజీ తరువాయి

ప్రక్షాళన చేసే ముందు అధిష్టానం కూడా ఆయన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని చాన్స్ ఉంటుంది. అయితే ఈ విషయాలు ఆయనకు తెలిసినా బయటికి చెప్పకుండా మహేశ్ కుమార్ జాగ్రత్త పడాల్సి ఉంటే బాగుండునని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అలాకాకుండా కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని చెప్పడం వల్ల ప్రభుత్వ వ్యవహారాల్లో ఆయన జోక్యం చేసుకుంటున్నారనే సంకేతాలు వెళ్లాయని అంటున్నారు. అలాగే ఐఏఎస్ అధికారుల పనితీరుపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజానికి అధికారుల పనితీరును అంచనా వేయాల్సింది సీఎం,మంత్రులు. కాని మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగంగా అధికారుల పనితీరు పై కామెంట్స్ చేయడం వల్ల అపోజిషన్ కు అస్త్రాలు అందించినట్లేనని కామెంట్స్ ఉన్నాయి.

## అమెరికాలో ఘోర ప్రమాదం.. బిజినెస్ జెట్ కూలి పలువురు మృతి

అమెరికాలో ఘోర ప్రమాదం జరిగింది. బిజినెస్ జెట్ కూలి పలువురు మృతి చెందారు. దేశంలోని నార్త్ కరోలినాలో ఈ ప్రమాదం జరిగింది. స్టేట్స్ విల్లే రీజనల్ ఎయిర్ పోర్టులో సెసనా c 550జెట్ ను ల్యాండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలింది. వెంటనే జెట్ నుంచి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందినట్లుగా అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ప్రమాదంలో ఎంతమంది చనిపోయారన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ ప్రమాదం కారణంగా ఎయిర్ పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డవ్వగా.. అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా.. జెట్ క్రాష్ అవ్వడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి.. 150 విమానాలు రద్దు

మొదటి పేజీ తరువాయి

ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు ఫ్లైట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని సూచించింది. ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమానయాన సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఇలాంటి సూచనలే చేశాయి. ప్రస్తుతం ఢిల్లీ–ఎన్సీఆర్, నోయిడా, ఘజియాబాద్‌లో దృశ్యమానత 100 మీటర్లుగా ఉంది.

ఢిల్లీలోని 39 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో ఏకంగా 14 కేంద్రాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. అత్యధికంగా ఆర్కే పురంలో గాలి నాణ్యత సూచిక 447గా నమోదైంది. ఆ తర్వాత ఆనంద్ విహార్, వివేక్ విహార్, సిరిఫోర్ట్ ప్రాంతాల్లో 442గా నమోదైంది. ద్వారకా సెక్టరా–8లో 429, నెహ్రూ నగర్‌లో 425, ఎన్ఎస్ఐటీ ద్వారకా ప్రాంతంలో 423, డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో 423, ఓఖ్లా ఫేజ్–2లో 422గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.

## 'అలాంటి ఒప్పందమేదీ జరగలేదు'.. సీఎం పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య..!

మొదటి పేజీ తరువాయి

గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

## తలసీమియా చికిత్సకోసం వెళ్తే హెచ్‌ఐవీ సోకింది రక్త మార్పిడితో ప్రమాదంలో చిన్నారుల జీవితాలు

మొదటి పేజీ తరువాయి

ఇక ఈ ఘటనపై ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను విధుల నుంచి సస్పెండ్ చేసింది. సత్నా జిల్లా ఆసుపత్రి మాజీ సివిల్ సర్జన్‌కు షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించింది. అంతేకాదు, వివరణ సంతృప్తికరంగా లేకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, సత్నా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఏడాది మార్చి నెలలో తొలి హెచ్‌ఐవీ పాజిటివ్ కేసు నమోదైంది. మార్చి 20వ తేదీన 15 ఏళ్ల తలసీమియా పేషంట్‌కు హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చింది. మార్చి 26 నుంచి 28 వరకు మరో ఇద్దరు చిన్నారులకు హెచ్‌ఐవీ పాజిటివ్ వచ్చింది. ఏప్రిల్ 3వ తేదీన మరో కేసు నమోదు అయింది. ఇలా మొత్తం ఐదుగురు చిన్నారులు హెచ్‌ఐవీ బారిన పడ్డారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల జీవితాలతో వైద్యులు ఆటలాడుతున్నారంటూ మండిపడ్డారు.

## కర్ణాటక ఆర్టీసీ దివాలా!.. పేరుకుపోయిన శక్తి ఫ్రీ బస్సు స్కీమ్ 4 వేల కోట్ల బకాయిలు

అధికారంలోకి రావడమే లక్ష్యంగా కర్ణాటకలోని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 5 గ్యారెంటీలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆగమాగంగా తయారైంది. ఐదు గ్యారెంటీల్లో భాగంగా తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం (శక్తి స్కీమ్) ఆర్టీసీ సంస్థకు గుదిబండగా మారింది. 2023లో ప్రారంభించిన శక్తి స్కీమ్ కింద మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నప్పటికీ, ఆర్టీసీకి చెల్లించాల్సిన సుమారు రూ. 4,006.47 కోట్ల బకాయిలను మాత్రం సిద్ధరామయ్య ప్రభుత్వం అటకెక్కించింది. ఈ మేరకు అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానాన్ని బట్టి అర్థమవుతున్నది.

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కర్ణాటక స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్టీసీ), బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ), నార్త్ వెస్టర్న్ కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ), కళ్యాణ కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేకేఆర్టీసీ) దివాలా అంచుకు చేరాయి. ప్రభుత్వం సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో తాము బస్సులను నడుపలేని పరిస్థితికి వచ్చామని, సిబ్బందికి కూడా వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఆర్టీసీ ఉన్నతాధికారి వాపోయాడు. ప్రభుత్వ తీరుపై విపక్ష నేతలు మండిపడ్డారు. అలవిగాని హామీలతో ఆర్టీసీని ప్రభుత్వం కుదేలు చేస్తున్నదని ధ్వజమెత్తారు.

1800 గ్రామాలకు బస్సేది??

శక్తి స్కీమ్ ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్నామంటూ ఒకవైపు ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నప్పటికీ, ఈ ఫ్రీ స్కీమ్ కారణంగా టికెట్ ధరలను పెంచారంటూ పురుషులు మండిపడుతున్నారు. బస్సు సర్వీసులను కూడా గణనీయంగా తగ్గించారంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని 1,800 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. శక్తి పథకం వినియోగించుకోవాలంటే మహిళలు కనీసం 2 కిలోమీటర్లు నడిచి దగ్గర్లోని మండల బస్టాప్‌లకు రావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ మేరకు ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు రవాణామంత్రి రామలింగారెడ్డి సమాధానం ఇచ్చారు. దీంతో శక్తి స్కీమ్ పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని. ఇదో విఫల పథకమని విపక్షాలు మండిపడుతున్నాయి.

# నిండు మనస్సుతో ఆశీర్వదించిన తండ ప్రజలకు కృతజ్ఞతలు

## బుర్కి తండ గ్రామ సర్పంచ్ అజ్మీరా జ్యోతి వీరన్న నాయక్

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: మూడో విడుత స్థానిక సంస్థల ఎన్నికల్లో నిండు మనసుతో ఆశీర్వదించిన బుర్కి తండ గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని, ఈ గెలుపు తండ అభివ ృద్ధి పట్ల బాధ్యతను పెంచిందని తండ ను ఆదర్శ తండ గా తీర్చిదిద్దుతామని గెలుపొందిన సర్పంచ్ అభ్యర్థి అజ్మీరా జ్యోతి వీరన్న నాయక్ అన్నారు. మరిపెడ మండలంలోని బుర్కి తండ గ్రామంలో జరిగిన మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తండ లోని మొత్తం 8 వార్డులకు గాను ఏడు వార్డులు కాంగ్రెస్, ఒక వార్డు బిఆర్ఎస్ గెలుచుకోవడం జరిగింది,సర్పంచుగా అజ్మీరా జ్యోతి వీరన్న నాయక్ 54 పై చిలుకు మెజారిటీతో ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ నన్ను గుర్తించి నాకు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గా టికెట్ ఇచ్చిన డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్ర నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పెండ్లి రఘువీర్ రెడ్డి కి ప్రత్యేక క ృతజ్ఞతలు తెలిపారు, మండల అధ్యక్షుల వారి సహకారం తో, తండ ప్రజల సహకారంతో తండ లో నెలకొన్న సమస్యలను పరిష్కారానికి క ృషి చేస్తామని అన్నారు. తమమీద నమ్మకంతో గెలిపించిన గ్రామస్తుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆలోచనలకు అనుగుణంగా పనులు చేస్తామని అన్నారు. తమను నిండు మనస్సుతో ఆశీర్వదించి గెలిపించిన తండ ప్రజలకు క ృతజ్ఞతలు తెలుపుతూ వారికి రుణపడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ యూనివర్సిటీ రూసా ప్రాజెక్టుల గడువు పెంపు కోరుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ: వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలుసుకున్నారు. వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో అమలవుతున్న రూసా 2.0(రిసెర్చ్, ఇన్నోవేషన్)ప్రాజెక్టుల గడువును మరో ఏడాది పెంచాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందరరేగా ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ..కాకతీయ యూనివర్సిటీకి రూసా 2.0 కింద మొత్తం రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో రూ.35 కోట్లు పరిశోధన ప్రాజెక్టులకు,రూ.15 కోట్లు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్,ఉద్యోగ అవకాశాల పెంపు మరియు ఇన్నోవేషన్ హబ్ (కె-హబ్) అభివ ృద్ధికి కేటాయించినట్లు కేంద్ర మంత్రికి వివరించారు. 2024 జూన్‌లో పరిపాలనా అనుమతులు లభించడంతో ప్రస్తుతం యూనివర్సిటీలో 5 పరిశోధన కేంద్రాలు,37 వ్యక్తిగత పరిశోధన ప్రాజెక్టులు క్రియాశీలంగా కొనసాగుతున్నాయని తెలిపారు. వీటితో పాటు మొత్తం 42 పరిశోధన ప్రాజెక్టుల కోసం 75 మంది రీసెర్చ్ ఫెలోలను నియమించారని పేర్కొన్నారు. అలాగే రూ.9.4 కోట్లతో సివిల్ పనులు,ఐసీటీ మౌలిక వసతులు,ఆధునిక ల్యాబ్ పరికరాల కొనుగోళ్లు కొనసాగుతున్నాయని చెప్పారు. అయితే ప్రస్తుత మార్చి 31,2026 గడువు ఈ విస్త ృత పరిశోధన కార్యక్రమాలు,మౌలిక వసతుల పనులు పూర్తి చేయడానికి సరిపోదని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే గడువును మార్చి 31,2027 వరకు పొడిగించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రిని కోరారు. గడువు పెంపుతో నిధుల సమర్థ వినియోగం సాధ్యమవుతుందని,పరిశోధన ఫలితాలు పూర్తిస్థాయిలో వెలువడతాయని,విద్యార్థులు,పరిశోధకులు దీరికాల ప్రయోజనాలు పొందుతారని ఎంపీ స్పష్టం చేశారు. గడువు పెంచకపోతే 42 పరిశోధన ప్రాజెక్టులు,75 మంది రీసెర్చ్ స్కాలర్స్ భవిష్యత్తుపై ప్రభావం పడే ప్రమాదముందని తెలిపారు. వరంగల్‌ను పరిశోధనలకు,నూతన ఆవిష్కరణలకు కేంద్రబిందువుగా అభివ ృద్ధి చేయడమే తన లక్ష్యమని,అందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అత్యవసరమని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య పేర్కొన్నారు.

# హమాలీల సంక్షేమానికి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి-సిఐటియు




తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: రాష్ట్రంలోని హమాలీ కార్మికుల రక్షణ,సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషం (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు 19న హైదరాబాద్‌లో జరిగిన సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో దశలవారీ ఆందోళన కార్యక్రమాలకు నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 20 నుంచి జనవరి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టనున్నట్లు,జనవరి 19న తహశీల్దార్ కార్యాలయాల వద్ద నిరసనలు,ఫిబ్రవరి 9న జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఛలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్లు,ఎఫ్‌సీఐ,సివిల్ సప్లై,బేవరేజెస్,రైస్ మిల్లులు తదితర రంగాల్లో పనిచేస్తున్న హమాలీలు సమాజానికి కీలక సేవలు అందిస్తున్నప్పటికీ,వారికి పీఎఫ్,ఈఎస్ఐ,ప్రమాద బీమా వంటి చట్టబద్ధ హక్కులు అందడం లేదని ఫెడరేషన్ నేతలు విమర్శించారు. 55 ఏళ్లు పైబడిన హమాలీలకు నెలకు కనీసం రూ.6,000 పెన్షన్ ఇవ్వాలని,ఐకెపి కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే హమాలీలకు ప్రభుత్వం నేరుగా బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తక్షణమే పేదలకు కేటాయించాలి

## అసంపూర్తి ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

## దూపకుంట డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన ఎంసీపీఐ(యు) బృందం



తెలుగు గళం న్యూస్ వరంగల్: కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తిచేసినప్పటికీ అర్హులైన పేదలకు కేటాయించకపోవడం సిగ్గుచేటని ఎంసీపీఐ(యు)జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పూర్తయిన ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలని,లేనిపక్షంలో అర్హులైన పేదలను సమీకరించి ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలోనే ఇండ్ల కేటాయింపు చేపడతామని హెచ్చరించారు. శుక్రవారం ఎంసీపీఐ(యు) వరంగల్ నగర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా,నగర నాయకుల బ ృందం దూపకుంట పరిధిలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శించి నిర్మాణ స్థితిగతులను పరిశీలించింది. ఈ సందరరేగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ..వందల కోట్ల రూపాయల ప్రజాధనంతో పేదలకు అన్ని సౌకర్యాలతో రెండు పడక గదుల ఇండ్లు ఇస్తామని ప్రచారం చేసిన గత ప్రభుత్వం కాలయాపన చేసి ఇండ్లను పంపిణీ చేయకుండానే అధికారాన్ని కోల్పోయిందన్నారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసిన కొండా సురేఖ ప్రస్తుతం మంత్రిగా ఉన్నప్పటికీ దూపకుంటలో పూర్తయిన ఇండ్లను ఇప్పటికీ పంపిణీ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వరంగల్ నగర పరిధిలో దూపకుంటలో సుమారు 2400 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా,అందులో సగం మాత్రమే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన ఇండ్లు అసంపూర్తిగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో పలు మార్లు అధికారులను కోరినా ఎలాంటి ఫలితం లేదని విమర్శించారు. అలాగే లక్ష్మీ టౌన్షిప్‌లో 210,తిమ్మాపూర్‌లో 456 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు పంపిణీ చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే పంపిణీ చేపట్టకపోతే అర్హులైన పేదలందరినీ సమీకరించి ఎంసీపీఐ(యు) ఆధ్వర్యంలో ఇండ్లు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇండ్ల నిర్మాణంలో నాసిరకం పనులు చేసి అసంపూర్తిగా వదిలేసిన వ్యవహారంపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత కాంట్రాక్టర్లు,అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరాలని డిమాండ్ చేశారు.

**"ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా":** పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించనున్నట్లు ఎంసీపీఐ(యు) నగర కార్యదర్శి మాలోత్ సాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్,నగర సహాయ కార్యదర్శి సుంచు జగదీశ్వర్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ముక్కెర రామస్వామి,నగర నాయకులు ఎగ్గని మల్లికార్జున్,మాలోత్ ప్రత్యూష,మాలి ప్రభాకర్,అప్పనపురి నర్సయ్య,మహమ్మద్ మెహబూబ్ పాషా,పరిమళ గోవర్ధన్ రాజు,తాటికాయల రత్నం,చుక్క ప్రశాంత్,నలివెల రవి,రామస్వామి,యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐద్వా 14వ జాతీయ మహాసభల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు


## సుశీల గోపాలన్ మహిళా ఉద్యమకారులకు ఆదర్శం

## -ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండి.షబానా



తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభల సందరరేగా రాష్ట్రవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు నిర్వహించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండి.షబానా పిలుపునిచ్చారు. అదేవిధంగా ఐద్వా వ్యవస్థాపకురాలు సుశీల గోపాలన్ 24వ వర్ధంతి సందర్భంగా జఫర్గడ్ మండలంలో ఐద్వా మండల కార్యదర్శి తాటికాల రేణుక అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఎండి.షబానా ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సుశీల గోపాలన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎండి.షబానా మాట్లాడుతూ..సుశీల గోపాలన్ నిత్య పోరాటశీలి,ధైర్యసాహసాలతో మహిళా ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన గొప్ప నాయకురాలని అన్నారు. ఆమె అలుపెరుగని పోరాట యోధురాలిగా,భారతదేశం గర్వించదగ్గ విద్యార్థి ఉద్యమకారిణిగా,మహిళా ఉద్యమాలకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. 1981లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం స్థాపనలో కీలక పాత్ర పోషించిన సుశీల గోపాలన్,ఐద్వా మొదటి ప్రధాన కార్యదర్శిగా సేవలందించారని తెలిపారు. తుదిశ్వాస విడిచే వరకు ఐద్వా అఖిల భారత ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతూ ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేశారని చెప్పారు. ఆమె చేసిన నిరంతర పోరాటాల ఫలితంగా పీచు కార్మికులకు వేతనాలు పెరగడంతో పాటు బోనస్‌లు చెల్లించే విధానం అమల్లోకి వచ్చిందన్నారు. మహిళలు ఆర్థికంగా,సామాజికంగా అన్ని రంగాల్లో ఎదుర్కొంటున్న వివక్షకు వ్యతిరేకంగా ఆమె నిరంతరం పోరాడుతూ మహిళలకు అండగా నిలిచారని తెలిపారు. చిన్ననాటి నుంచే అనేక అడ్డంకులు ఎదురైనా వాటిని లెక్కచేయకుండా దోపిడీ లేని సమాజ నిర్మాణం కోసం క ృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో భారత లక్ష్మమ్మ,కోమల,రజిత,గూగుల్,వద్దు,అక్షయ,చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# పర్మిషన్ లేకుండా అకాడమీల పేరుతో ఇంటర్ కాలేజీలు చర్యలు తీసుకోవాలి-ఎస్ఎఫ్ఐ



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా పరిధిలో అనుమతులు లేకుండా అకాడమీల పేరుతో ఇంటర్మీడియట్ తరగతులు నిర్వహిస్తున్న బన్సల్ అకాడమీ,నైన్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఐఏఎస్ కృష్ణ ఆదిత్య కి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.అశోక్ రెడ్డి మాట్లాడుతూ..నగరంలో అకాడమీ పేరుతో అనుమతులు లేకుండా ఇంటర్ కాలేజీలను విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఒకే భవనంలో అకాడమీలతో పాటు జూనియర్ కాలేజీలు,బాయ్స్-గర్ల్స్ హాస్టల్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారని తెలిపారు. ఈ అక్రమాలపై ఎన్నిసార్లు విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రత,భవిష్యత్తును ద ృష్టిలో పెట్టుకుని వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు స్టాలిన్,జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

# అపర దేశభక్తుడు అష్ఫాఖుల్లా ఖాన్




తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అపర దేశభక్తుడు షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ అని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్బాస్ కొనియాడారు. స్వాతంత్ర్యం,ప్రజాస్వామ్యం,లౌకికవాద పరిరక్షణ కోసం అష్ఫాఖుల్లా ఖాన్ స్ఫూర్తితో పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ 98వ వర్ధంతి సభ ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో,ఆవాజ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సందరరేగా మహమ్మద్ అబ్బాస్ మాట్లాడుతూ..అష్ఫాఖుల్లా ఖాన్ ఉరిశిక్ష అమలు జరుగుతున్న రోజున "నా మాత ృభూమిని ఆంగ్లేయుల శృంఖలాల నుంచి విముక్తం చేయాలనుకున్నాను. నా త్యాగం వృథా కాదు. మరెందరో త్యాగధనులకు ఇది స్ఫూర్తినిస్తుంది. నా దేశం స్వేఛ్చా వాయువులు పీలుస్తుంది. చాలా త్వరలో బానిస సంకెళ్ళు తెగిపోతాయి. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరికంబాన్ని ఎక్కబోతున్న అద ృష్టవంతుడిగా గర్వపడుతున్నాను"అంటూ ఉరితాడును ముద్దాడి,స్వయంగా తన మెడలో వేసుకున్నారని గుర్తు చేశారు. రాంప్రసాద్ బిస్మిల్‌తో కలిసి హిందుస్థాన్ రిపబ్లికన్ ఆర్మీలో అష్ఫాఖుల్లా ఖాన్ కీలకంగా పనిచేశారని తెలిపారు. కకోరి కుట్ర కేసులో భాగంగా ఆయనకు ఉరిశిక్ష విధించగా,1927 డిసెంబర్ 19న ఉరిశిక్ష అమలైందన్నారు. నేటి రోజుల్లో మతోన్మాదం దేశ సమైక్యత,సమగ్రతకు సవాళ్లు విసురుతున్న తరుణంలో,అష్ఫాఖుల్లా ఖాన్-రాంప్రసాద్ బిస్మిల్ లు ఐక్యంగా చేసిన పోరాటం యువతకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. సామ్రాజ్యవాదాన్ని తరిమికొట్టేందుకు హిందూ-ముస్లిం ప్రజలు ఐక్యంగా ఎలా పోరాడారో అదే స్ఫూర్తితో,దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీజ్ అహమ్మద్ ఖాన్,షేక్ అబ్దుల్ ఇలియాజ్,బాలక ృష్ణ,మీర్ అబిద్ అలీ,షేక్ అబ్దుల్ తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు అండగా ఉంటాం

## -మాజీ మంత్రి హనుమంత రావు



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వం, జాతీయ భావన పెంపొందుతాయని మాజీ క్రీడా శాఖల మంత్రి వి హనుమంతరావు అన్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాదు అంబర్పేట మున్సిపల్ మైదానంలో గ్రాస్ రూట్స్ ఆలిండియా హాకీ టోర్నమెంట్ ఫర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఓవైసీ కాద్రి మెమోరియల్ ట్రోఫీ పోటీలను ప్రారంభించిన మాజీ ఎంపీ హనుమంతరావు. ఈ పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు 8 జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి హాకీ క్రీడా పోటీలను ప్రారంభించి మాజీ ఎంపీ హనుమంతరావు మాట్లాడుతూ యువతపై తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఇప్పటికే మౌలిక సదుపాయాలు,శిక్షణ,ప్రోత్సాహకాలు అందిస్తున్నదని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా క్రీడాకారుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మరింత సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రం,దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షిస్తూ,క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్ గౌడ్,హాకీ కోచ్ మనోరంజన్,టెన్నికాయిట్ జాతీయ క్రీడాకారులు సద్గురు,వెంకటేష్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్,రామ్మోహన్,రాకేష్,కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే సర్వేలు బంద్-ఆశా వర్కర్స్




తెలుగు గళం న్యూస్ కొమురం భీం ఆసిఫాబాద్: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆశా కార్యకర్తలకు పెండింగ్‌లో ఉన్న లెప్రసీ తదితర సర్వేల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆశా వర్కర్స్ ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాను తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి నేతృత్వం వహించారు.ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ,డిసెంబర్ 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా లెప్రసీ సర్వేలు ప్రారంభమయ్యాయని,అయితే ఈ సర్వేలకు సంబంధించిన పారితోషికాలపై ఇప్పటికీ స్పష్టత లేదని విమర్శించారు.గతంలో చేసిన లెప్రసీ,పల్స్ పోలియో,ఎన్నికల విధుల బకాయిలు 2023-2024 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.బకాయిలు చెల్లించకుండా మళ్లీ సర్వేలు చేయమంటే ఆశాలు వెట్టి చాకిరికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ధర్నాకు స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎం,హెచ్ఓ)ధర్నా స్థలానికి వచ్చి మాట్లాడారు.తన పరిధిలో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని,ఇందుకు సంబంధించిన సర్క్యులర్‌ను జారీ చేస్తానని హామీ ఇచ్చారు.మిగతా డిమాండ్లను పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.ఆశా కార్యకర్తలకు న్యాయం చేయాలని,బకాయిలు విడుదల చేసే వరకు సర్వేలు చేయబోమని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.

# శంకరపట్నం మండలంలో తెలంగాణ జాగృతిలో భారీ చేరికలు



తెలుగు గళం న్యూస్ శంకర్ పట్నం: శంకరపట్నం మండలంలో తెలంగాణ జాగృతిలో భారీగా చేరికలు జరిగాయి.జాగృతి సీనియర్ నాయకురాలు ఎండి సల్మా ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు చింతిరెడ్డి జైపాల్ రెడ్డి,సోహెల్,విష్ణువర్ధన్,మహిళ నాయకురాలు సానియా,నాజీయా,అజీత్ సోని లతో పాటు సుమారు 50 మంది మహిళలు జాగృతిలో చేరారు.వీరికి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ జాగృతి కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ..తెలంగాణ జాగృతిని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని,2029 వరకు రాష్ట్రానికి నాయకత్వం వహించే స్థాయిలో జాగృతిని అన్ని విధాలుగా బలోపేతం చేస్తామని తెలిపారు.ప్రభుత్వం ప్రతిపక్షం రెండూ ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించారు.కవితక్క నాయకత్వంలో జాగృతి గత రెండేళ్లుగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు.శంకరపట్నం మండలంలో కలువల ప్రాజెక్టు పునర్నిర్మాణం పూర్తయ్యే వరకు జాగృతి పోరాటం కొనసాగిస్తుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్,మండల ఇంచార్జ్ చంటి శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి,మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అంకం శివరాణి,బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల శ్రీనివాస్,సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్,గాలిపల్లి రత్నాకర్ చారి,జంగ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 20న ఉప-సర్పంచ్ ఎన్నికల ప్రత్యేక సమావేశం



TELANGANA STATE ELECTION COMMISSION
1st Floor, DTCP Building, A.C. Guards, Hyderabad – 500 004.

NOTIFICATION

No.1238/TGSEC-PR/2025, Dt: 19.12.2025

In exercise of the powers conferred under Sub-Section (9) and third proviso sub-section (10) of Section 15 of the Telangana Panchayat Raj Act, 2018 and Rule 4 of the Rules relating to Telangana Panchayat Raj (Conduct of Elections of Upa-Sarpanch of Gram Panchayat) Rules, 2018, the State Election Commission, hereby, directs the District Panchayat Officer concerned or any Officer authorized by him to convene a special meeting on **20.12.2025** for conduct election to the offices of Upa-Sarpanch in Gram Panchayats indicated in the **Annexure** in accordance with the procedure laid down under the said rules. A Notice of the day and hour of meeting shall be given prior to the day of Upa-Sarpanch election meeting to all the members of the Gram Panchayat including its Sarpanch.

SD/- I. RANI KUMUDINI
STATE ELECTION COMMISSIONER

To

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్,డిసెంబర్ 19: తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో ఉప-సర్పంచ్ పదవుల ఎన్నికల కోసం డిసెంబర్ 20,2025న ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018లోని సెక్షన్ 15(9),ఉప-సెక్షన్ (10)లోని మూడవ నిబంధనతో పాటు తెలంగాణ పంచాయతీ రాజ్(గ్రామ పంచాయతీ ఉప-సర్పంచ్ ఎన్నికల నిర్వహణ) నియమాలు-2018లోని రూల్ 4 కింద కల్పించిన అధికారాలను వినియోగిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది.ఈ మేరకు సంబంధిత జిల్లా పంచాయతీ అధికారి లేదా ఆయనచే అధికారం పొందిన అధికారి,అనుబంధంలో పేర్కొన్న గ్రామ పంచాయతీల్లో ఉప-సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎన్నికల సమావేశం జరిగే తేదీ, సమయ వివరాలను సర్పంచ్‌తో పాటు గ్రామ పంచాయతీ సభ్యులందరికీ ముందుగా తెలియజేయాలని స్పష్టం చేశారు.ఈ నోటిఫికేషన్‌పై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని సంతకం చేశారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- చట్ట పరిరక్షణకు ఊరూరా ఉద్యమాన్ని ఉధృతం చేయాలి
- ఈనెల 20 నుంచి 23 వరకు జిల్లా వ్యాప్తంగా బిల్లు పత్రాల దహనం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



తెలుగు గళం న్యూస్ సూర్యాపేట: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు.శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ,మండల-పట్టణ కార్యదర్శుల సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.దేశవ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ,బలహీన వర్గాలకు చెందిన 30 కోట్ల మందికి పైగా పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని ఆయన ఆరోపించారు.పనిదినాలు పెంచామని చెప్పుకుంటూ,వాస్తవానికి కూలీల సంఖ్యను భారీగా తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు.ప్రస్తుత చట్టం ప్రకారం 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం భరించాల్సి ఉండగా,కొత్త బిల్లులో దాన్ని 60 శాతానికి తగ్గించి,మిగతా 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలపై మోపడం వల్ల నిధుల కొరత ఉన్న రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.వ్యవసాయ పనులు ఉన్న సమయంలో 60 రోజుల పనిని నిషేధించడం వల్ల గ్రామీణ కూలీలకు ఉపాధి దొరకని పరిస్థితి తలెత్తుతుందని అన్నారు.మహాత్మా గాంధీ పేరును తొలగించి చట్టం పేరును మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు.ఉపాధి హామీ చట్టం ప్రకారం 100 రోజులు తప్పనిసరిగా పని కల్పించాలని,పనిదినాలను 200 రోజులకు పెంచాలని,కూలీని రూ.307 నుంచి రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు.గత చట్టాన్ని యథావిధిగా అమలు చేసి,ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని కోరారు.ఈ బిల్లుతో పేదలకు కలిగే నష్టాలను ప్రజలకు వివరించేందుకు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఈనెల 20 నుంచి 23 వరకు సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బిల్లు పత్రాలను దగ్ధం చేయాలని ప్రకటించారు.రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు ఉద్యమాలకు సిద్ధం కావాలని సూచించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార,ప్రతిపక్ష పార్టీలు డబ్బు,మద్యం,కులం,మతం పేరుతో ప్రజలను ప్రభావితం చేసినప్పటికీ,సీపీఎం అభ్యర్థులు అన్ని అవరోధాలను తట్టుకొని పోటీ చేసి గెలుపొందారని తెలిపారు.సూర్యాపేట జిల్లాలో 9 సర్పంచ్ స్థానాలు,11 ఉప సర్పంచ్ స్థానాలు,126 వార్డు సభ్యులు సీపీఎం తరఫున గెలిచారని వెల్లడించారు.ఎన్నికల్లో గెలిచిన సీపీఎం ప్రజాప్రతినిధులు ప్రజా హక్కుల కోసం పోరాడుతూ,గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు.ఈ సమావేశానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా,జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు కో లిశెట్టి యాదగిరి రావు,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకలపల్లి రాములు,నాగారపు పాండు,పారేపల్లి శేఖర్ రావు,మట్టిపెల్లి సైదులు,కోట గోపి,చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ప్రచారం

## సీఐటీయూ,రైతు,వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకుల పిలుపు



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్,డిసెంబర్ 19: కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక,రైతు,వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని సీఐటీయూ,తెలంగాణ రైతు సంఘం,వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు,ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడారు.వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్-రోజ్‌గార్ మరియు ఆజీవికా మిషన్ (గ్రామీణ్)బిల్లు-2025(వీబీ-రామ్‌జీ బిల్లు)ను తీసుకురావాలనే కేంద్ర ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు.మహాత్మా గాంధీ పేరును తొలగించి 'జీ-రామ్-జీ' అనే సంక్షిప్త నామాన్ని ప్రవేశపెట్టడం వెనుక చట్టాన్ని నీరుగార్చే దురుద్దేశం దాగి ఉందన్నారు.ఈ బిల్లు పని హక్కును పరిమితం చేసి,గ్రామీణ కార్మికులను ఉపాధి అవకాశాల నుంచి దూరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మోసపూరిత బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఎంజీఎన్ఆర్ఈజీఏ వ్యవసాయ కార్మిక,రైతాంగ పోరాటాల ఫలితమని,ఇది డిమాండ్ ఆధారిత చట్టం కావడంతో పనికి డిమాండ్ పెరిగినప్పుడు బడ్జెట్ కేటాయింపులు పెంచాల్సిన బాధ్యత కేంద్రానిదేనని తెలిపారు.వ్యవసాయ పనుల గరిష్ట కాలంలో పనిని నిషేధించడం ద్వారా చట్ట లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.ఈ బిల్లు అమలైతే భారీ వలసలు పెరిగే ప్రమాదం ఉందన్నారు.తరతరాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్లు తీసుకురావడం ద్వారా బడా కార్పొరేట్లకు మేలు చేస్తున్నారని,విద్యుత్ సవరణ బిల్లుతో రైతులు,నిరుపేదలకు ఉన్న క్రాస్ సబ్సిడీని ఎత్తివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.రైతాంగ ఉద్యమంతో రద్దైన మూడు వ్యవసాయ చట్టాల అమలులో భాగంగానే కొత్త సీడ్ బిల్లును తీసుకొచ్చి దేశీయ-విదేశీ కార్పొరేట్లకు వ్యవసాయ రంగాన్ని అప్పగించాలనే కుట్ర జరుగుతోందన్నారు.ఈ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు,రైతులు,వ్యవసాయ కార్మికులు,మహిళా,యువజన సంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వాహన యాత్రలు,గ్రామస్థాయి పాదయాత్రలతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే ప్రచార కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య,ఆర్.సుధాభాస్కర్,కోశాధికారి వంగూరు రాములు,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సౌలభ్యం కోసమే ఫర్టిలైజర్ బుకింగ్ యాప్

## ఈ నెల 20 నుండి యూరియా బుకింగ్ యాప్ ప్రారంభం

### మరిపెడ మండల వ్యవసాయ శాఖ అధికారి వీరసింగ్




తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా: ప్రస్తుత యాసంగి సీజన్లో యూరియా కొనుగోలు చేయుటకు వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ అమలులోకి తీసుకువచ్చింది అని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల వ్యవసాయ విస్తరణ అధికారి వీరసింగ్ తెలిపారు,గత వాన కాలంలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ యాప్ ను అమలులోకి తీసుకురావడం జరిగింది .రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంటను బట్టి వారికున్న విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో ఏ డీలర్ అయినా ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవడం జరుగుతుంది .ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయవచ్చు .ఏదైనా పరిస్థితులలో 24 గంటల లోపు యూరియాను తీసుకోనట్లయితే ఆ యొక్క బుకింగ్ రద్దు అవుతుంది మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది .ఇందులో పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వాళ్ళు మరియు కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. కౌలు దారులు అయితే వాళ్ళు ఎవరి దగ్గర అయితే కౌలుకు తీసుకున్నారు వారి యొక్క పట్టాదారు పాస్ బుక్ నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చు .అయితే ఆ పట్టాదారు ఓటీపీ చెప్పాల్సి ఉంటుంది .ఈ యొక్క యాప్ ను రైతులకు అలవాటు చేయటానికి మరియు అవగాహన కల్పించడానికి ప్రతి ఔట్లెట్ దగ్గర వ్యవసాయ శాఖ ద్వారా ఒక వ్యక్తిని నియమించడం జరుగుతుంది లేదా సంబంధిత ఏఈ ఓ రైతులకు సహాయం చేయడం జరుగుతుంది .కాబట్టి రైతులందరూ కూడా ఈ యొక్క యాప్ను వినియోగించుకొని యూరియాను కొనుగోలు చేయవచ్చు. భూమి విస్తీర్ణాన్ని అనుసరించి ప్రతి 15 రోజుల వ్యవధిలో విడతల వారీగా యూరియా బుకింగ్ చేసుకునే విధానం అమల్లో ఉంటుందన్నారు దీనివలన యూరియా సరఫరాలలో అంతరాయం లేకుండా ఉండడంతో పాటు అక్రమ నిల్వలు మరియు దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయడం జరుగుతుందన్నారు, దయచేసి రైతులు ఈ యొక్క సదుపాయాన్ని బుకింగ్ యాప్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# యూరియా బుకింగ్ యాప్ అమలుపై సమీక్ష

## -జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



తెలుగు గళం న్యూస్ జనగామ: యూరియా బుకింగ్ యాప్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని,ప్రతి మండలంలో మండల స్థాయి సమన్వయ సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.శుక్రవారం గూగుల్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో యూరియా బుకింగ్ యాప్ అమలుపై సమీక్ష నిర్వహించిన కలెక్టర్,యాప్ వినియోగంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..మండల స్థాయి సమావేశాలకు తహసీల్దార్,ఎంపీడీవో,మండల వ్యవసాయ అధికారి తప్పనిసరిగా హాజరై పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.అలాగే,ప్రతి యూరియా విక్రయ కేంద్రానికి ఒక వ్యవసాయ శాఖ అధికారిని ట్యాగ్ చేయాలని,యాప్ ప్రారంభ దశలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు,రైతుల సందేహాలు,డీలర్ల ఇబ్బందులను తక్షణమే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు.ఎఇఓలకు ప్రత్యేక ఆదేశాలు గ్రామ స్థాయిలో రైతులకు యూరియా బుకింగ్ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని,రైతులు యాప్‌ను పూర్తిగా అలవాటు చేసుకునే వరకు నిరంతర మార్గనిర్దేశం అందించాలని కలెక్టర్ సూచించారు.యాప్ అమలుతో యూరియా పంపిణీలో పారదర్శకత పెరిగి,దుర్వినియోగానికి అడ్డుకట్ట పడుతుందని,రైతులకు సమయానికి యూరియా అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

"ఇజిఎస్ చెల్లింపులపై సూచనలు": గ్రౌండింగ్ అయిన అన్ని ఇందిరమ్మ ఇళ్లకు బేస్‌మెంట్ స్థాయిలో 40 రోజులు,రూఫ్ లెవెల్ స్థాయిలో 50 రోజులు ఇజిఎస్ చెల్లింపుల కోసం మంజూరు పొందాలని ఆదేశించారు.పరిపాలన అనుమతులు తీసుకున్న అనంతరం మస్టర్లు రూపొందించి,90 రోజుల ఇజిఎస్ చెల్లింపులు ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు.ప్రారంభం కాని ఇందిరమ్మ ఇళ్లను మళ్లీ పరిశీలించాలని,అర్హత గల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు వెంటనే ఇసుక కూపన్లు జారీ చేయాలని సూచించారు.ఈ గూగుల్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్లు,ఆర్డీఓలు,తహసీల్దార్లు,ఎంపీడీవోలు,డిఎఓ,పిడి,హౌసింగ్,మండల స్పెషల్ ఆఫీసర్లు,ఎంఎఓలు పాల్గొన్నారు.

# రైతులకు అలర్ట్ ఇకపై మొబైల్ యాప్ ద్వారానే యూరియా బుకింగ్

## 20 డిసెంబర్ 2025 నుంచి 9 జిల్లాల్లో అమలు

తెలుగు గళం న్యూస్ జనగామ: రాష్ట్రంలో యూరియా పంపిణీలో పారదర్శకత పెంచడం,అక్రమాలు మరియు దుర్వినియోగాన్ని అరికట్టడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై రైతులు యూరియాను కేవలం మొబైల్ యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి అని స్పష్టం చేసింది. మాన్యువల్ లేదా ఆఫ్లైన్ బుకింగ్‌లకు ఇకపై అనుమతి ఉండదని అధికారులు తెలిపారు. ఈ కొత్త విధానం తొలి విడతగా రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో రేపటి నుంచి అనగా 20.12.2025 నుంచి అమల్లోకి రానుంది.

తొలి విడతలో అమలు అయ్యే జిల్లాలు: జనగామ, ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ , మహబూబ్‌నగర్, వికారాబాద్, కరీంనగర్


డిజిటల్ విధానం ద్వారా యూరియా పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు,అర్హులైన రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు.

యూరియా బుకింగ్ యాప్ వినియోగంలో సాంకేతిక సమస్యలు లేదా ఫిర్యాదులు ఉంటే రైతులు ఈ నంబర్‌ను సంప్రదించవచ్చు. హెల్ప్‌లైన్ నంబర్– 8977745512


రైతులందరూ ఈ మార్పును గమనించి,ప్రభుత్వం అందించిన మొబైల్ యాప్ ద్వారానే తమ యూరియా అవసరాలను బుక్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

# భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన సర్పంచ్‌లు

## గ్రామాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం : గండ్ర వెంకట రమణారెడ్డి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: భూపాలపల్లి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిని నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు మరియు వార్డు సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాయంపేట మండలం సూర్యనాయక్ తండా గ్రామ సర్పంచ్ లావుడ్య రమ రవీందర్, ఉప సర్పంచ్ మాలోతు సునీత భాస్కర్‌తో పాటు వార్డు సభ్యులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా నర్సింహులపల్లి గ్రామ సర్పంచ్ గోనె నాగరాజు, చిట్యాల మండలం నవాబ్‌పేట గ్రామ వార్డు సభ్యులు కూడా మాజీ ఎమ్మెల్యేను కలిసి గ్రామాల అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామపంచాయతీ పాలనలో ఐక్యత, సమన్వయం చాలా ముఖ్యమని పేర్కొన్న ఆయన, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు కలిసి పనిచేస్తే గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ భేటీ గ్రామాభివృద్ధిపై సానుకూల చర్చలకు దారితీసిందని, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు వెల్లడించారు.




# నూతనంగా గెలిచిన గ్రామ సర్పంచులు, ఉపసర్పంచ్‌లు, వార్డ్ సభ్యులకు శుభాకాంక్షలు

## గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించి గ్రామాభివృద్ధికి కలిసి పనిచేయాలి : అయిలి మారుతి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి: ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో నూతనంగా గెలుపొందిన గ్రామ సర్పంచులు,ఉప సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులకు ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదాలతో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన వారు తమ బాధ్యతను గుర్తించి గ్రామాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శక పాలన అందించాలని ఆకాంక్షించారు. అలాగే ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన అభ్యర్థులు నిరుత్సాహపడవద్దని ఆయన ధైర్యం చెప్పారు. గెలుపు–ఓటములు రాజకీయాల్లో సహజమని పేర్కొన్న ఆయన,"అస్తమించిన సూర్యుడు మళ్లీ ఉదయించడం ఎంత నిజమో, పోరాటంలో ఓడిన వీరుడు తిరిగి విజయం సాధించడం కూడా అంతే నిజం" అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో వారికీ తప్పకుండా విజయం వరించాలని భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. మనమంతా ఒకే ఊరి వారమని, ఎన్నికల సమయంలో ఏర్పడిన కోపతాపాలు, రాగద్వేషాలను పక్కన పెట్టి నూతనంగా గెలిచిన సర్పంచ్ నాయకత్వంలో గ్రామాభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమిష్టి కృషితోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, ప్రజలు ఐక్యంగా ముందుకు సాగాలని అయిలి మారుతి కోరారు.

# ఓ పేద విద్యార్థిని భవిష్యత్తు కోసం తన ఆస్తినే ష్యూరిటీగా పెట్టిన హరీష్ రావు

## రూ.20 లక్షల ఎడ్యుకేషన్ లోన్‌కు ఇంటినే గ్యారంటీగా నిలిచిన మాజీ మంత్రి



తెలుగు గళం న్యూస్ సిద్దిపేట: సిద్దిపేట జిల్లాకు చెందిన ఓ పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని చదువు పట్ల ఉన్న పట్టుదల, ప్రతిభను గుర్తించిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు మానవీయతకు మరోసారి నిదర్శనంగా నిలిచారు. సిద్దిపేటలో పుట్టి పెరిగిన ఓ యువతి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల మధ్య కూడా కష్టపడి ఎంబీబీఎస్ పూర్తి చేసింది. అనంతరం మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించి సీటు దక్కించుకుంది. అయితే పీజీ చదువుకు అవసరమైన భారీ ఫీజుల కారణంగా ఆమె కుటుంబం తీవ్ర ఆందోళనకు గురైంది. ఆ యువతి తండ్రి టైలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బ్యాంక్ ద్వారా ఎడ్యుకేషన్ లోన్ లభించే అవకాశం ఉన్నప్పటికీ, అందుకు అవసరమైన భూమి లేదా ఇల్లు వంటి ఆస్తి లేకపోవడంతో లోన్ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ విషయాన్ని తెలుసుకున్న హరీష్ రావు, ఆ విద్యార్థిని ప్రతిభను, ఆత్మవిశ్వాసాన్ని గుర్తించి ఆమెకు అండగా నిలిచారు. రూ.20 లక్షల ఎడ్యుకేషన్ లోన్‌కు తన సొంత సిద్దిపేట ఇంటినే ష్యూరిటీగా పెట్టి బ్యాంక్‌కు హామీ ఇచ్చారు. హరీష్ రావు సహకారంతో బ్యాంక్ అధికారులు స్వయంగా ఆయన వద్దకు వచ్చి అవసరమైన పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. అనంతరం అక్కడికక్కడే లోన్ చెక్కును విద్యార్థినికి అందజేశారు. అదే కాకుండా,వ్యక్తిగతంగా మరో రూ.1 లక్ష ఆర్థిక సహాయం కూడా అందించి, ఆమె కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం విద్యార్థిని కుటుంబాన్ని తన నివాసానికి ఆహ్వానించి భోజనం ఏర్పాటు చేసి,"బాగా చదివి సమాజంలో పేదలకు సేవ చేసే స్థాయికి ఎదగాలి" అంటూ ఆశీర్వదించారు. ఈ సంఘటన సిద్దిపేట ప్రజలతో హరీష్ రావుకు ఉన్న అనుబంధాన్ని మరోసారి స్పష్టంగా చూపించింది. ప్రజల కష్టాల్లో తాను భాగస్వామిగా ఉండడమే కారణంగా ఏ ఎన్నిక వచ్చినా సిద్దిపేట నుంచి ఆయనకు 70 శాతం పైగా ఓట్లు వస్తున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజకీయాలకు అతీతంగా మానవీయతతో ముందుకు వచ్చిన హరీష్ రావు చర్యపై అన్ని వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

# పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన... కాంగ్రెస్ నాయకులు



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/డిసెంబర్ 19: వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలంలోని, కట్రీయాల గ్రామములో ఇందిరమ్మ కమిటీ సభ్యులు తాటికాయాల కుమారస్వామి మాతృమూర్తి తాటికాయల సత్తెమ్మ మృతిచెందిరి. స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఆదేశాల మేరకు గ్రామ ఉప సర్పంచ్ నాంపెల్లి రవీందర్,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య టెంపుల్ చైర్మన్ కట్ట వెంకటయ్య, మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండి అక్బర్ లు చేరుకొని పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుమారస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమములో 7 వ వార్డు సభ్యులు ఎలికట్టే చిన్న రాజు, కాంగ్రెస్ యువ నాయకులు కొండ్రతి సంతోష్,ఇరుకు బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 22న తెలంగాణలో వరద,పరిశ్రమ ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్




తెలుగు గళం న్యూస్ జనగామ: జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో వరదలు,పరిశ్రమల ప్రమాదాల నివారణపై ఈనెల 22న నిర్వహించనున్న మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లపై శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్డిఎంఎ డైరెక్టర్ సుధీర్ బాల్,తెలంగాణ ఫైర్ సర్వీస్ డైరెక్టర్ నారాయణరావుతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,జిల్లా స్థాయి శాఖాధికారులతో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ..వరదలు,పరిశ్రమలు,రహదారుల ప్రమాదాలు సహా వివిధ రకాల విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు,ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత శాఖల యంత్రాంగానికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. వరదల సమయంలో ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడం,వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడం,రిలీఫ్ క్యాంపుల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా,వివిధ ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు తక్షణమే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య బృందాలు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో నీటిపారుదల,విద్యుత్,రహదారులు,పోలీస్,వైద్య,పౌర సరఫరాల తదితర శాఖలు సమన్వయంతో పనిచేయడానికి ప్రతి ఏడాది మాక్ ఎక్సర్సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జనగాం జిల్లా నుంచి ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్‌తో పాటు ఆర్ అండ్ బి,ఇరిగేషన్,అగ్నిమాపక,పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్యాంగ్ రేప్ ఘటనపై ఎన్ కౌంటర్ డిమాండ్



తెలుగు గళం న్యూస్ మహబూబ్ నగర్: మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన గ్యాంగ్ రేప్ ఘటనపై బాధిత కుటుంబాన్ని ఎస్సి,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పరామర్శించారు. అత్యాచారం,హత్యలో పాల్పడిన నిందితులను రాజకీయ ప్రమేయం లేకుండా అరెస్ట్ చేసి వెంటనే ఎన్ కౌంటర్ చేయాలని కమిటీ డిమాండ్ చేసింది. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా,ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కూడా వారు కోరారు. ఈ సంఘటన బుధవారం రాత్రి గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ మరియు మహబూబ్ నగర్ జిల్లా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్,మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శంకుస్థాపన చేసిన స్థలం లోనే వంద పడకల ఆసుపత్రి నిర్మించాలి

## కట్ర్యాల గ్రామం నుంచి వంద పడకల ఆసుపత్రిని తరలిస్తే ఊరుకునేదే లేదు

## భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి



తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/డిసెంబర్ 19 వరంగల్ జిల్లా: వర్ధన్నపేట మండలం కట్ర్యాల గ్రామం ఉప్పరపల్లి క్రాస్ వద్ద నిర్మించ తలపెట్టిన వంద పడకల ఆసుపత్రిని వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రానికి తరలిస్తే ఊరుకునేది లేదని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరియు స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారిని హెచ్చరించారు. మూడు మండలాల ప్రజలకు అందుబాటులో విధంగా నిర్మించ తలపెట్టిన ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రిని నియోజకవర్గ కేంద్రం వర్ధన్నపేటకు తరలించడం ద్వారా మూడు మండలాలకు చెందిన గ్రామాల ప్రజలకు అన్యాయం జరుగుతుందని దానిని గుర్తుంచుకొని ఎక్కడైతే వంద పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేశారు అక్కడే నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టి దెబ్బ వర్ధన్నపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తగిలిందని ఇప్పటికైనా ఆ పార్టీ బుద్ధి తెచ్చుకొని నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కోసం నియోజకవర్గ ప్రజలకు ఉచిత వైద్య విద్య అందించడం కోసం ప్రజలకు అనువైన సౌకర్యాలను కల్పించడం కోసం పని చేస్తే బాగా ఉంటుందని మహేందర్ రెడ్డి అన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గం లోని గ్రామాలకు ఎటువంటి అభివృద్ధి చేపట్టని రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే గారు ఖాళీ శంకుస్థాపనలతో కాలయాపన చేస్తూ కాంగ్రెస్ నేతల జేబులు నింపుకోవడం కోసం కొన్ని మాఫియాలను పెంచుకుంటూ పోతూ వారి స్వలాభం కోసం వారి కుటుంబ స్వలాభం కోసం పనిచేస్తూ ఉన్నారని అది గమనించిన ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మరియు ఎమ్మెల్యేకి గట్టిగా బుద్ధి చెప్పారనేది వర్ధన్నపేట నియోజకవర్గంలో నిరూపణ జరిగిందని అని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని మేజర్ గ్రామపంచాయతీలు అయిన పంతిని .కట్ర్యాల. గ్రామాల్లో భారతీయ జెండా పార్టీ జెండా ఎగరవేసిందని అలాగే కక్కిరాలపల్లి గ్రామంలో భారతీయ జనతా పార్టీ ఉపసర్పంచ్ చేజిక్కించుకోవడం జరిగిందని ఇల్లంద గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకుండా చేయడం కడారి గూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీ ఇవ్వడం జరిగిందని దీన్ని ఆలోచించి ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే బుద్ధి తెచ్చుకోవాలని గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఉప్పరపల్లి గ్రామం లో కూడా కాంగ్రెస్ పార్టీకి ఉనికి లేకుండా ప్రతిపక్షాలు పనిచేశాయని ఈ విధంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్ల ప్రజలు అధికార పార్టీకి గట్టి బుద్ధి చెప్పారని కావున ప్రజలకు అవసరమైన పనులను అతి త్వరలో చేపట్టి వారికి అవసరమైన అన్ని విధాల విద్య వైద్య నీటి సౌకర్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి రావలసిన దేవాదుల నీరు ఇప్పటికీ తేకపోవడం ఎంత విడ్డూరంగా ఉంది అంటే ఇచ్చిన హామీలను మరిచిపోయి నిద్రపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కొని ప్రజలకు న్యాయం చేయకపోతే నిత్యం ప్రభుత్వం ప్రజల వ్యతిరేకత ఎదుర్కోక తప్పదని ప్రజల సహకారంతో ఉప్పరపల్లి క్రాస్ వద్ద నిర్మించ తలపెట్టిన 100 పడకల ఆసుపత్రిని తరలిస్తే పెద్ద ఉద్యమాన్నిగా నిర్మించి గట్టిగా బుద్ధి చెప్తామని వచ్చే ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికి లేకుండా చేస్తామని మహేందర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గారిని హెచ్చరించారు.

# పని హక్కును హరించేది జిరామ్ జి బిల్లు

## ప్రతిపక్షాల వాదనలను పట్టించుకోని ఎన్డీఏ ప్రభుత్వం

## జాయింట్ పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు కు నిరాకరణ

తెలుగు గళం న్యూస్ బ్యూరో :కాంగ్రెస్ పార్టీ ,వామపక్ష పార్టీల ఎంపీల నిరసనల మధ్య నిన్న పార్లమెంట్ సమావేశాలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి దాని స్థానంలో విబి జి రామ్ జి బిల్లును పార్లమెంటు ఆమోదించింది.రాజ్యసభలో ఆమోదం పొందాల్సి ఉంది.రాష్ట్రపతి ఆమోదిస్తే బిల్లు చట్ట రూపంలో దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుంది.గాంధీ పేరు మాత్రమే మారుస్తున్నాం.మెరుగైన చట్టాన్ని తీసుకొస్తున్నామని పార్లమెంటులో ఎన్ డి ఏ ప్రభుత్వం బలంగా వాదించింది.అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి కోట్లాదిమంది గ్రామీణ వ్యవసాయ కార్మికులు ఇతర పేదలకు భరోసాగా ఉన్న 100 రోజుల పని కల్పించే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దు చేయాలని ఆలోచన బిజెపి ప్రభుత్వం చేస్తూ వచ్చింది.ఈ ఆలోచనకు తుది రూపం జిరాంజి బిల్లు ద్వారా ఇచ్చింది.

"జి రామ్ జి బిల్లులో అసలు ఏముంది ?": మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాస్త పథకం రూపంలోకి మార్పు చేశారు.రానున్న కాలంలో గ్రామీణ పేదలు పనిని హక్కుగా పొందే అవకాశం ఉండదు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దయాదక్షిణ్యాల మీదనే ఈ పథకం అమలు కావడానికి అవకాశం ఉందని మేధావులు చెప్తున్నారు.ఇప్పటివరకు 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం ఇస్తే రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం మ్యాచింగ్ గ్రాంట్ నిధులతో ఉపాధి పనులు జరుగుతున్నాయి.జి రాంజీ బిల్లు అమల్లోకి వస్తే కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం నిధులను కేటాయించే విధంగా మార్పులు చేశారు.వ్యవసాయ సీజన్ ఖరీఫ్,రబీ కాలాలలో 60 రోజుల పనిని పెట్టకుండా బ్లాక్ చేయాలని పేర్కొన్నారు.పని ప్రదేశాలలో యంత్రాల వినియోగం పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేశారు.కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రాధాన్యత క్రమంలో రాష్ట్రాలకు ఇస్తుందని పేర్కొన్నారు.కేంద్ర ప్రభుత్వం సూచించిన పనులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాలని పేర్కొన్నారు.వంద రోజుల నుండి 125 రోజులకు పని దినాలను పెంచుతున్నామని చెబుతూనే పని కల్పనపై ఆంక్షలు పెట్టారు.కూలీల డిమాండ్ ఆధారంగా అపరిమితంగా పని కల్పన విధానాన్ని రద్దు చేశారు.

"రాష్ట్ర ప్రభుత్వాలకు పెనుబారమే": ఆర్థిక లోటు బడ్జెట్ తో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు 40% నిధులను ఈ పథకానికి కేటాయించాలంటే పెను సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రాధాన్యత క్రమం పేరుతో తనకు గిట్టని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వ నిధులలో కోత విధించే ప్రమాదం ఉంది అనే చర్చ జరుగుతున్నది.తన మాట వినని రాష్ట్ర ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ ద్వారా లొంగదీసుకునే అవకాశం కూడా ఇందులో దాగి ఉన్నది.

ముహమ్మద్ సలీం
స్టేట్ బ్యూరో-తెలంగాణ

# పారామెడికల్ కొలువుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

## ప్రజా భవన్ ఆందోళనతో కదిలిన యంత్రాంగం



తెలుగు గళం న్యూస్ హైదరాబాద్: తెలంగాణలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పారామెడికల్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది.తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా భవన్ వద్ద అభ్యర్థులు భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు.ఈ క్రమంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించగా,ఆయన తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి నియామక ప్రక్రియపై స్పష్టమైన హామీలు ఇప్పించారు.

పోస్టుల వారీగా భర్తీ అప్‌డేట్స్: పోస్టుల వివరాలు ప్రస్తుత పరిస్థితి / హామీ నర్సింగ్ ఆఫీసర్లు (2322 పోస్టులు) డిసెంబర్ 22 (సోమవారం) న మెరిట్ లిస్ట్ విడుదల.వారం రోజుల్లో ఫైనల్ లిస్ట్, వెరిఫికేషన్. ల్యాబ్ టెక్నీషియన్లు కౌన్సిలింగ్ షెడ్యూల్ ఖరారు. రేపటి నుండి 3 రోజుల పాటు కౌన్సిలింగ్ నిర్వహించి అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ జారీ. ఫార్మసిస్ట్ పోస్టులు డ్రగ్ కంట్రోల్ అథారిటీ నివేదిక మంత్రి పరిశీలనలో ఉంది. ఆమోదం రాగానే రిక్రూట్‌మెంట్ ప్రాసెస్ ప్రారంభం. ఎఎన్ఎం రిక్రూట్‌మెంట్ హైకోర్టు ఆర్డర్ దృష్ట్యా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.క్లారిటీ రాగానే ప్రక్రియ మొదలు.అధికారులతో చిన్నారెడ్డి ఫోన్ సంభాషణ

అభ్యర్థుల ఆవేదనను విన్న జి.చిన్నారెడ్డి,పారామెడికల్ బోర్డు సెక్రటరీ మరియు ప్రిన్సిపల్ సెక్రటరీలతో స్వయంగా మాట్లాడారు.నర్సింగ్ ఆఫీసర్ల మెరిట్ లిస్ట్ విషయంలో ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ,సోమవారం నాటికి జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు.అటు ల్యాబ్ టెక్నీషియన్ల కౌన్సిలింగ్ షెడ్యూల్ నేడు సాయంత్రమే విడుదల కావడంతో అభ్యర్థులు హర్షం వ్యక్తం చేశారు.సంఘీభావం తెలిపిన నేతలు,ఈ కార్యక్రమంలో యూనియన్ నేతలతో పాటు వివిధ కేటగిరీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.నర్సింగ్ విభాగం నుండి సుష్మ, శిరీష,మధుబీల్యాబ్ టెక్నీషియన్ల నుండి ఆదిత్య,సంగమేశ్వర,శంకర్‌బీఫార్మసిస్ట్ కేడర్ నుండి సౌమ్య, స్రవంతి,నవీన్ తదితరులు పాల్గొని తమ గోడు వెళ్లబోసుకున్నారు.తమ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన యూనియన్ నాయకత్వానికి,తక్షణమే స్పందించిన ప్రభుత్వానికి అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్య గమనిక:ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సోమవారం నాటికి నర్సింగ్ ఆఫీసర్ల మెరిట్ లిస్ట్ రాకపోతే తదుపరి కార్యాచరణ ప్రకటించేందుకు అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారు.

# నేటి నుండి యూరియా బుకింగ్‌కు కొత్త యాప్..

## స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ శాఖ అధికారి వెల్లడి



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్: తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎరువుల పంపిణీలో నూతన నిబంధనలు అమలులోకి రానున్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ వ్యవసాయ శాఖ అధికారి ఒక ప్రకటనలో వెల్లడించారు.డిసెంబర్ 20, 2025 నుండి రైతులు యూరియా బస్తాలు పొందాలంటే తప్పనిసరిగా 'ఫర్టిలైజర్ బుకింగ్ యాప్' ద్వారా ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

నియమ నిబంధనలు ఇవే: యాప్ ద్వారానే పంపిణీ: ఇకపై డీలర్ల వద్ద నేరుగా యూరియా లభించదు. యాప్‌లో బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే ఎరువులు అందజేస్తారు. పంట నమోదు ఫోన్ నంబర్:రైతులు పంట నమోదు సమయంలో ఇచ్చిన మొబైల్ నంబర్‌తోనే యాప్‌లో ఓటిపి ద్వారా లాగిన్ అవ్వాలి.

"నిర్ణీత కోటా:" రైతుకు ఉన్న భూమి విస్తీర్ణం, సాగు చేస్తున్న పంట ఆధారంగా ఎన్ని యూరియా బస్తాలు అవసరమో యాప్ ముందే లెక్కిస్తుంది.ఆ సంఖ్య మేరకే బుకింగ్ చేసుకునే వీలుంటుంది.

"పారదర్శకత కోసం": ఎరువుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మరియు అసలైన సాగు రైతులకు సకాలంలో యూరియా అందించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అధికారి వివరించారు.

"రైతులకు విజ్ఞప్తి": స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని రైతులు ఈ విషయాన్ని గమనించి, సాగు నమోదులో ఇచ్చిన ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని,ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందే యాప్‌లో బుకింగ్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి సూచించారు.

# న్యాయమైన వేతనాల కోసం షాహి టెక్స్టైల్ కార్మికుల సమరం-11వ రోజుకు చేరిన ధర్నా





తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ (నాచారం): నగరంలోని నాచారం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న 'షాహి టెక్స్టైల్' కంపెనీ మహిళా కార్మికులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటం ఉధృతమవుతోంది. గత 11 రోజులుగా (డిసెంబర్ 8 నుండి) వందలాది మంది మహిళా కార్మికులు కంపెనీ ఎదుట శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నారు.ఈ పోరాటానికి మానవ హక్కుల వేదిక పూర్తి సంఘీభావం ప్రకటించింది.శ్రమ దోపిడీకి పరాకాష్ట.9,300 వేతనం కంపెనీలో దాదాపు 1600 మంది మహిళా కార్మికులు బట్టలు కత్తిరించడం నుండి ప్యాకింగ్ వరకు శ్రమిస్తున్నారు.12 ఏళ్లుగా పనిచేస్తున్న వారికి కూడా నెలకు కేవలం 9,300 మాత్రమే వేతనం ఇస్తుండటం గమనార్హం.దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఉన్న షాహి యూనిట్ల కంటే హైదరాబాద్‌లోనే అత్యంత తక్కువ వేతనాలు ఇస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమల్లో లేని కార్మిక చట్టాలు కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఇవే:సెలవుల నిరాకరణ-నెలకు రెండు సెలవులు ఇస్తామని చెప్పి,తీరా అడిగితే సెలవు మంజూరు చేయడం లేదు.ఒకవేళ సెలవు పెడితే జీతంలో కోత విధిస్తున్నారు.తీరిక లేని పని- ఉదయం కనీసం టిఫిన్ తినడానికి 5 నిమిషాల సమయం కూడా ఇవ్వకుండా సూపర్ వైజర్లు టార్గెట్ల కోసం ఒత్తిడి తెస్తున్నారు. హక్కులపై అవగాహన కల్పించకపోవడం- ప్రసూతి సెలవులు,కనీస వేతన చట్టం,మరియు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి కార్మికులకు ఎలాంటి సమాచారం లేదు.మేనేజ్మెంట్ వివక్ష-మేనేజర్లకు,సూపర్ వైజర్లకు జీతాలు పెరుగుతున్నా,కార్మికులు అడిగితే మాత్రం కంపెనీ నష్టాల్లో ఉందని సాకులు చెబుతున్నారు.మానవ హక్కుల వేదిక డిమాండ్లు ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక హైదరాబాద్ యూనిట్ ప్రతినిధులు వెంకట నారాయణ (ఉపాధ్యక్షులు),సంజీవ్ (ప్రధాన కార్యదర్శి) మాట్లాడుతూ..కార్మిక శాఖ తక్షణమే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

వారి ప్రధాన డిమాండ్లు- కనీస వేతన చట్టం ప్రకారం కార్మికులకు వేతనాలు పెంచాలి. క్యాజువల్,సిక్,మెటర్నిటీ లీవులను చట్టబద్ధంగా అమలు చేయాలి. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి.కార్మికులకు అండగా నిలుస్తున్న టియుసిఐ మరియు సిఐటియు సంఘాల కృషిని హెచ్ఆర్ఎఫ్ అభినందించింది.11 రోజులుగా పోరాడుతున్నా కార్మిక శాఖ స్పందన నెమ్మదిగా ఉందని,కేవలం విచారణల పేరుతో కాలయాపన చేయకుండా కార్మికులకు న్యాయం చేయాలని వారు కోరారు.

# ఈ పండ్లను తింటే మీకు అసలు క్యాన్సర్ రాదు..

# క్యాన్సర్ కణాలు నాశనం అవుతాయి..



హెల్త్ న్యూస్, 19 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ప్రస్తుతం భారతీయులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లల్లో క్యాన్సర్ కూడా ఒకటి. రోజురోజుకీ ఈ వ్యాధి బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందనే చెప్పవచ్చు. జీవన విధానంలో మార్పులు, ధూమపానం, జంక్ ఫుడ్ ను ఎక్కువగా తీసుకోవడం, రేడియేషన్ కు ఎక్కువగా గురవ్వడం, రసాయనాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, జన్యుపరమైన కారణాల వల్ల చాలా మంది ఈ వ్యాధి బారిన పడుతున్నారు. అలాగే ఈ వ్యాధికి సరైన మందు లేదనే విషయం మనందరికీ తెలిసిందే. కనుక వ్యాధి బారిన పడి బాధపడడానికి బదులుగా ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మన ఆహారంలో మార్పులు చేసుకోవడం మరింత అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మామిడి, నేరేడు..

క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కొన్ని రకాల పండ్లు మనకు ఎంతగానో దోహదపడతాయని వారు చెబుతున్నారు. వీటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కణాల పెరుగుదల తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని వారు తెలియజేస్తున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించే పండ్ల గురించి వివరాలను అందిస్తున్నారు. మామిడి పండ్లల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల అసాధారణ కణాల పెరుగుదల వేగం తగ్గుతుంది. అలాగే నేరేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో మనకు సహాయపడతాయి. వీటిలో యాంటీ ప్రొలిఫెరేటివ్ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి హానికారక కణాల వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి.

ఉసిరి, మారేడు..

ఉసిరికాయలను తీసుకోవడం వల్ల కూడా మనం క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. ఉసిరిలో ప్రీక్లినికల్ నమూనాలు ఉంటాయని వీటి సారం క్యాన్సర్ పై ఆశాజనక ప్రభావాలను చూపించదని నిపుణులు చెబుతున్నారు. అలాగే కోకుమ్ అనే పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఈ పండ్లల్లో ఫైటోకెమికల్స్ ఎక్కువగా ఉంటాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అదేవిధంగా మారేడు పండ్లు కూడా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో ఎంతో దోహదపడతాయని చెబుతున్నారు. ఇవి క్యాన్సర్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయని వీటిలో ఉండే బయోయాక్టివ్ సమ్మేళనాలు కణాలను రక్షించడంలో సహాయపడతాయని తెలియజేస్తున్నారు.

పనస, వాక్కాయలు..

అలాగే ఆహారంలో భాగంగా పనస పండ్లను తీసుకోవడం వల్ల కూడా మంచి ఫలితం ఉంటుంది. ఇవి కణాల ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి క్యాన్సర్ ను నిరోధించడంలో ఎంతో దోహదపడతాయి. క్యాన్సర్ ను ఎదుర్కోవడంలో వాక్కాయ పండ్లు కూడా మనకు ఎంతో ఉపయోగపడతాయి. వీటిలో ఉండే రక్షణ సమ్మేళనాలు క్యాన్సర్ మార్పులను నివారించడంలో తోడ్పడతాయి. ఇక మంకీ జాక్ ఫ్రూట్ పండ్లు కూడా క్యాన్సర్ అభివృద్ధిని తగ్గిస్తాయి. ఈ పండ్లు మనలో చాలా మందికి తెలియవు. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్ క్యాన్సర్ వ్యాప్తిని తగ్గించడంలో దోహదపడతాయి. ఈ విధంగా ఈ పండ్లను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాప్తి తగ్గడంతో పాటు క్యాన్సర్ బారిన పడే అవకాశాలు కూడా తగ్గుతాయి.

## గంభీర్ కోచ్ కాదు.. జస్ట్ మేనేజర్ : కపిల్ దేవ్




స్పోర్ట్స్ న్యూస్, 19 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): భారత మాజీ కెప్టెన్, 1983 వరల్డ్‌కప్ విజేత కపిల్ దేవ్ టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న కపిల్ దేవ్... ప్రస్తుత క్రికెట్‌లో హెడ్ కోచ్ పాత్ర ట్రెడిషనల్ కోచింగ్ కంటే ప్లేయర్ మేనేజ్‌మెంట్‌పైనే ఎక్కువగా ఉండాలని అన్నారు. "ఈ రోజుల్లో కోచ్ అనే పదాన్ని చాలా లూజ్‌గా వాడుతున్నారు. గంభీర్ అసలు కోచ్ కాదు, జట్టుకు మేనేజర్ మాత్రమే. స్కూల్, కాలేజీల్లో నేర్పేవాళ్లే నిజమైన కోచ్‌లు. ఇంటర్నేషనల్ స్థాయిలో ఆటగాళ్లు ఇప్పటికే స్పెషలిస్ట్‌లు.

లెగ్ స్పిన్నర్‌కు, వికెట్ కీపర్‌కు గంభీర్ ఎలా కోచింగ్ ఇస్తాడు?" అని వ్యాఖ్యానించారు. మేనేజర్‌గా ఆటగాళ్లను ప్రోత్సహించడం, వారిలో నమ్మకం నింపడం, మానసిక సౌకర్యం కల్పించడమే ముఖ్యమని కపిల్ అన్నారు. ఫామ్‌లో లేని ప్లేయర్‌లకు అండగా నిలవడం కెప్టెన్, మేనేజర్ బాధ్యత అని తెలిపారు. గంభీర్ ఇకపై ఈ బాధ్యతలు సరిగ్గా నిర్వర్తించాలని కోరారు. దక్షిణాఫ్రికాతో సొంత దేశంలో 0-2 టెస్ట్ సిరీస్ ఓటమి తర్వాత గంభీర్‌పై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో కపిల్ వ్యాఖ్యలు మరోసారి సంచలనం రేపాయి.

## టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్‌తో సిరీస్‌కు.. ఈ తేదీనే జట్లను ప్రకటించనున్న బీసీసీఐ..!



స్పోర్ట్స్ న్యూస్, 19 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): కొత్త ఏడాదిలో భారత్-శ్రీలంక సంయుక్తంగా ఐసీసీ టీ20 ప్రపంచ కప్ జరుగనున్నది. అదే సమయంలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లో భారత జట్టు తలపడనున్నది. ప్రపంచకప్, న్యూజిలాండ్‌తో సిరీస్‌కు భారత జట్టును ఎంపిక చేసేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం సమావేశం కాబోతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రాబోయే బిజీ షెడ్యూల్ నేపథ్యంలో భారత జట్టును ఎంపిక చేసేందుకు ముంబయిలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో సమావేశం జరుగనున్నట్లు తెలిపింది. ఈ సమావేశంలో టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో జట్టును.. అంతకంటే ముందు న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచుల టీ20 సిరీస్ కోసం జట్టును ఎంపిక చేయడంపై సెలక్షన్ కమిటీ దృష్టి సారించనున్నది.

సెలక్షన్ కమిటీ ప్రస్తుతం ఉన్న జట్టును కొనసాగించేందుకే మొగ్గు చూపుతుంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేసిన టీ20 జట్టునే ప్రపంచకప్‌లో ఆడించే అవకాశం ఉంది. జట్టులో పెద్దగా ఊహించని మార్పులు ఏవీ ఉండవని భావిస్తున్నారు. 15 మంది సభ్యుల జట్టును ఐసీసీకి ముందుగానే సమర్పించాల్సి ఉన్నప్పటికీ.. టోర్నీ మొదలయ్యే సమయానికి ఆటగాళ్లను మార్చుకునే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఎవరైనా ఆటగాళ్లు గాయాల బారినపడినా.. ఫామ్‌లో గణనీయమైన మార్పులు ఎదురైనా ఎదుర్కొనేందుకు టీమ్ మేనేజ్‌మెంట్‌కు కొంత వెసులుబాటును కల్పిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్ న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సైతం ఆతిథ్యం ఇస్తుంది. ఇరు జట్లు జనవరి 11 నుంచి 31 వరకు మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడుతాయి. టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరిలో మొదలవుతుంది. టీమిండియా తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్‌ఏతో ఆడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న నమీబియాతో ఢిల్లీలో ఆడుతుంది. ఆ తర్వాత గ్రూప్ దశలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లోని భారీ నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడుతుంది. ఇప్పటికే ఐసీసీ షెడ్యూల్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా.. ప్రపంచకప్‌కు ముందు టీమిండియా కెప్టెన్‌తో పాటు పలువురు ఆటగాళ్ల ఫామ్‌పై ఆందోళన కొనసాగుతున్నది. టీ20 సారథి సూర్య కుమార్ యాదవ్ ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. నిలకడగా పరుగులు చేయలేకపోవడంతో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. బ్యాట్‌తో పరుగులు చేయలేకపోయినా కెప్టెన్‌గా రికార్డు బాగుంది. ఈ క్రమంలో ప్రపంచకప్‌లో జట్టును నడిపించేందుకు బీసీసీఐ, సెలక్షన్ కమిటీ సూర్యపైనే నమ్మకం ఉంచే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఇక వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్థానం ప్రశ్నార్థకంగా ఉంది. ప్రపంచకప్ జట్టులో చోటుపై అనిశ్చితి కొనసాగుతున్నది. గిల్ టెస్టులు, వన్డే ఫార్మాట్‌లో సారథిగా కొనసాగుతున్నప్పటికీ.. టీ20లో మాత్రం పెద్ద స్కోర్ చేయలేక ఇబ్బందిపడుతున్నాడు. దాంతో జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం, సంజు శాంసన్‌తో పాటు పలువురు యువ ఆటగాళ్ల గిల్ పోటీని ఎదుర్కొంటున్నాడు. గిల్ ఫామ్ మెరుగుపడకపోతే 2024 ప్రపంచకప్ గెలిచిన జట్టులో అత్యద్భుతంగా రాణించిన యశస్వీ జైస్వాల్ అతని స్థానంలోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## మహిళా షూటర్‌పై అత్యాచారం.. ఫరీదాబాద్‌లో ముగ్గురు అరెస్టు




స్పోర్ట్స్ న్యూస్, 19 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): ఫరీదాబాద్‌లో 23 ఏళ్ల మహిళా షూటర్ తన హోటల్ రూంలో అత్యాచారానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఆ షూటర్ స్నేహితురాలిని కూడా అరెస్టు చేశారు. బాధిత మహిళ నిందితులను హోటల్ రూమ్‌లో లాక్ చేసింది. డిసెంబర్ 17వ తేదీన ఈ ఘటన జరిగింది. పోలీసులను ఆమె అప్రమత్తం చేసింది.

భివానీకి చెందిన యువ షూటర్ ఫరీదాబాద్ హోటల్‌లో రేప్‌కు గురైనట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో బాధిత షూటర్‌కు చెందిన స్నేహితురాలైన మరో మహిళా షూటర్‌తో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. సూరజ్‌కుండ్‌లోని కర్ని స్టేడియంలో జరుగుతున్న షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు బాధితురాలు ఫరీదాబాద్ వెళ్లింది. బాధిత మహిళా షూటర్‌తో ఆ టోర్నీలో పాల్గొనేందుకు రాజస్థాన్‌లోని జున్‌జున్‌కు చెందిన 26 ఏళ్ల మహిళా షూటర్ వచ్చింది. అయితే గురువారం షూటింగ్ పోటీలు ముగిసిన తర్వాత ఖ్వాజా సరాయిలోని హోటల్‌లో ఉండాలని బాధితురాలిని ఆమె స్నేహితురాలు అడిగింది.

బాధిత వ్యక్తికి చెందిన స్నేహితురాలి బాయ్‌ఫ్రెండ్ ఫరీదాబాద్ హోటల్‌లో రెండు రూమ్‌లు బుక్ చేశాడు. అయితే ఆ వ్యక్తి తనతో పాటు హోటల్‌కు మరో వ్యక్తిని తీసుకువచ్చాడు. ఆ ముగ్గురు కలిసి మద్యం సేవించేలా తనపై వత్తిడి తెచ్చినట్లు బాధితురాలు పేర్కొన్నది. ఆ తర్వాత ఓ వ్యక్తి ఉన్న రూమ్‌కు తనను పంపినట్లు బాధిత మహిళా షూటర్ ఆరోపించింది. ఆ సమయంలో అతను రేప్ చేసినట్లు బాధితురాలు పోలీసులకు చెప్పింది. ముగ్గురు అనుమానితులను రూమ్‌లో బంధించిన బాధితురాలు ఆ తర్వాత ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసింది. హోటల్‌కు చేరుకున్న ఎమర్జెన్సీ సిబ్బంది ఆ ముగ్గుర్నీ నిర్బంధించాకె. బాధితురాలి శరీరంపై గాయాలు ఉన్నట్లు పోలీసులు తేల్చారు.

## భారత్ లో మెస్సి పర్యటన.. రూ.50 కోట్ల పరువు నష్టం దావా వేసిన గంగూలీ



స్పోర్ట్స్ న్యూస్, 19 డిసెంబర్ (తెలుగు గళం న్యూస్): గోట్ టూర్ ఆఫ్ ఇండియా పేరుతో అర్జెంటీనా ఫుట్ బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సి.. భారత పర్యటనను సక్సెస్ ఫుల్‌గా కంప్లీట్ చేసుకున్నారు. కాగా.. ఈ టూర్ లో భాగంగా ఆయన కోల్ కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో నిర్వహించిన ఈవెంట్లో పాల్గొన్నారు. కానీ అక్కడ ఈవెంట్ ఆర్గనైజ్ చేయడంలో నిర్వాహకులు ఫెయిల్ కావడంతో మెస్సి అనుకున్న సమయం కంటే ముందుగానే మైదానం నుంచి వెళ్లిపోయాడు. దీంతో అభిమానులు ఆగ్రహంతో విధ్వంసం సృష్టించారు. అయితే.. ఇందులో గంగూలీకి పాత్ర ఉందంటూ అర్జెంటీనా ఫ్యాన్ క్లబ్ అధ్యక్షుడు ఉత్తమ్ సాహా ఆరోపించాడు. మెస్సి ఈవెంట్ నిర్వాహకుడైన శతద్రు దత్తాకు సౌరభ్ గంగూలీ మీడియేటర్‌గా ఉన్నట్లు మీడియాతో అన్నాడు. దీనిపై గంగూలీ రియాక్ట్ అయ్యాడు. సాహా చేసిన వ్యాఖ్యలపై రూ.50 కోట్ల పరువునష్టం దావా వేశాడు.

ఉత్తమ్ సాహా ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఇలాంటి ఆరోపణలు చేయడం తన పరువుకు భంగం కలిగించాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోల్ కతాలో జరిగిన మెస్సి ఈవెంట్ కు తానొక అతిథిగా మాత్రమే వెళ్లానని, ఈ ఈవెంట్ తో తనకు అధికారికంగా ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు.

# సినిమా న్యూస్



## హెయిర్ వల్ల అవకాశాలు కోల్పోయా

'ఝుమ్మంది నాదం' సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన హీరోయిన్ తాప్సీ మనందరికీ సుపరిచితమే. ఫస్ట్ మూవీతోనే మంచి విజయం సాధించింది. ఆ తర్వాత చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. అలా అప్పట్లో ఓ రేంజ్‌కి ఎదిగిన ఈ చిన్నది ప్రజెంట్ టాలీవుడ్‌లో అంతగా సినిమాలు చేయడం లేదు. మరి దీనికి కావడం అవకాశాలు రాకపోవడమో, మరేదేమైనా కారణమా అనేది తెలియదు. ఇక ఈ చిన్నదాని పర్సనల్ లైఫ్ విషయానికి వస్తే కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే మథియాస్ బో అనే బ్యాడ్మింటన్ ప్లేయర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటినుంచి ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌కి షిఫ్ట్ అయ్యి.. అక్కడ వరుస సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా రాణిస్తోంది.

ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ తన హెయిర్ వల్ల చాలా అవకాశాలు కోల్పోయానని ఆసక్తికర కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'కెరీర్ తొలినాళ్లలో ప్రతి దర్శకుడు నా జుట్టు స్ట్రైయిట్ చేయించుకోమని అడిగేవారు. చాలాకాలం వరకు దర్శకులు గ్లామర్, స్టైలీష్ లుక్ అంటే కేవలం స్ట్రైయిట్ హెయిర్ మాత్రమే అనే ఆలోచనలో ఉన్నారు. రింగుల జుట్టు అంటే కేవలం రెబల్ రూల్స్ అని భావించారు. అందుకే రింగుల జుట్టు ఉన్న అమ్మాయి పాజిటివ్ పాత్రలకు పనికిరాదని భావించేవారు.

కెరీర్ మొదట్లో నా హెయిర్ స్ట్రైయిట్ చేయించుకోవడానికి అంగీకరించాను. కానీ తర్వాత సినిమాలే కాకుండా బ్రాండ్ యాడ్స్ సంస్థలు సైతం నా జుట్టు స్ట్రైయిట్ చేయించుకోవాలని చెప్పడం నచ్చలేదు. నాకు యాడ్ చేయడానికి చాలా పెద్ద బ్రాండ్స్ ఆసక్తి చూపించాయి.. కానీ రింగుల జుట్టు కాకుండా స్ట్రైయిట్ హెయిర్ కావాలంటే నేను రిజెక్ట్ చేశాను. అందమైన జుట్టు అంటే రింగుల జుట్టు కాదనే వారి ఆలోచన నన్ను తీవ్రంగా నిరాశ పరిచాయి. చిన్నప్పుడు సైతం నేను నా జుట్టును అసహ్యించుకున్నాను.. కానీ ఆ తర్వాత నా జుట్టుపై కేర్ తీసుకున్నాను' అని చెప్పుకొచ్చింది.

## 'బైరాన్‌పల్లిలో మొదలైన తిరుగుబాటు అక్కడే సమాధి కావాలి'

### అంచనాలను పెంచుతున్న 'ఛాంపియన్' ట్రైలర్

టాలీవుడ్ యంగ్ హీరో రోషన్ గత కొద్ది కాలంగా ఇండస్ట్రీకి దూరం అయ్యాడు. ఇప్పుడు మళ్లీ 'ఛాంపియన్' మూవీతో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాతో మలయాళ బ్యూటీ అనస్వర రాజన్ టాలీవుడ్‌కు పరిచయం కాబోతుంది. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దీంతో ప్రమోషన్స్ జోరు పెంచిన చిత్రబృందం వరుస అప్డేట్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే ప్రదీప్ అద్వైతం ప్రయత్నాలు మొదలెట్టారు. తాజాగా, 'ఛాంపియన్' మూవీని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా లాంచ్ చేయించారు. ట్రైలర్ విషయానికొస్తే.. 1947 స్వాతంత్ర్యం కంటే ముందే జరిగిన సంఘటనలను ఆధారంగా చేసుకుని సినిమా తెరకెక్కినట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా బైరాన్‌పల్లి తిరుగుబాటు నేపథ్యంలో కథ నడవనుందనే భావన కలుగుతోంది.

గ్రామీణ ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, బ్రిటిష్ వారు చేసిన దౌర్జన్యం, చివరకు వారిపై నిలిచిన యువత ధైర్యం కథలో హైలైట్ అయే అవకాశం కనిపిస్తోంది. ట్రైలర్‌లో చూపించిన యాక్షన్ మరియు ఇంటెన్సిటీ ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. బ్రిటిష్ వారితో జరిగిన పోరాటం, రక్తపాతం, కాల్పుల సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్ కానున్నాయి. మరీ ముఖ్యంగా – "బైరాన్‌పల్లిలో మొదలైన తిరుగుబాటు ఆ గడ్డమీదే సమాధి కావాలి" అని రోషన్ చెప్పిన డైలాగ్ అంచనాలను రెట్టింపు చేస్తోంది.రోషన్ లుక్ పూర్తిగా కొత్తగా కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. గత సినిమాల కంటే భారీగా ఒవర్‌హాల్ అయిన బాడీ టోన్ మరియు డైలాగ్ డెలివరీ ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. మరోవైపు, అనస్వర రాజన్ పాత్రలో భావోద్వేగాలకు మంచి స్థానం ఉందని ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. టెక్నికల్ వైపు చూసినా 'ఛాంపియన్' బలంగా కనిపిస్తోంది. 'ఛాంపియన్'పై ఇప్పటికే ఇండస్ట్రీలో మంచి అంచనాలు నెలకొన్నాయి. నిజ సంఘటనల ఆధారంగా వస్తున్న పీరియాడిక్ డ్రామా కావడంతో ప్రేక్షకులు కూడా సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




## స్టార్ హీరో సూర్యతో స్క్రీన్ షేర్ నా కెరీర్‌లో స్పెషల్ మూవీ: నజ్రియా



కొంతకాలం గ్యాప్ ఇచ్చిన మలయాళ బ్యూటీ నజ్రియా మళ్లీ సినిమాలకు రీఎంట్రీ ఇవ్వడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. కోలీవుడ్ స్టార్ హీరో సూర్యతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనుంది. 'సూర్య-47'వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఇటీవల పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా మొదలైన ఈ మూవీ షూటింగ్ నేటి నుంచి ప్రారంభం అయినట్లు సమాచారం. ఈనేపథ్యంలో.. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నజ్రియా ఆసక్తికర కామెంట్స్ చేసింది. "జితు మాధవన్ దర్శకత్వం వహించిన 'సూర్య -47' కథాంశం చాలా ఆసక్తికరంగా, కొత్తగా ఉంటుంది. ప్రేక్షకులు ఒక అద్భుతమైన వినోదాన్ని పొందబోతున్నారని నేను ఖచ్చితంగా చెప్పగలను. పెద్ద స్టార్ అయిన సూర్య గారితో కలిసి పనిచేయడానికి ఎక్సైటింగ్‌గా ఉంది.

సూర్య సర్‌తో నటించే అవకాశం రావడం నిజంగా సంతోషంగా అనిపిస్తుంది. ఆయన పని తీరు, డెడికేషన్ గురించి చాలా విన్నాను. ఇప్పుడు ఆయనతో కలిసి స్క్రీన్‌ను షేర్ చేసుకోబోతున్నాను. ఈ స్క్రిప్ట్ చాలా నచ్చింది. పాత్రలో పర్‌ఫార్మెన్స్‌కు మంచి స్కోప్ ఉంది. నా పాత్రకు సంబంధించిన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ, స్క్రిప్ట్ పాయింట్లపై కష్టపడుతున్నాను. దర్శకుడు కూడా నన్ను చాలా గైడ్ చేస్తున్నారు. ఈ సినిమా నా కెరీర్‌లో ప్రత్యేక స్థానం సంపాదిస్తుంది. ఆడియన్స్ ఎప్పట్లాగే నన్ను ప్రేమిస్తారని నమ్ముతున్నా. ఈ కథలో ఎమోషన్, ఫన్, రొమాన్స్ అన్నీ ఉన్నాయి. స్టార్ హీరోతో స్క్రీన్ షేర్ చేసుకోవడం గౌరవంగా ఉంది" అని చెప్పింది. అయితే ఇందులో నజ్రియా హీరోయిన్‌గా నటించనుందా? లేదా కీలక పాత్రలో కనిపించనుందా? అనేది క్లారిటీ రావాల్సి ఉంది.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.